www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

బుధవారం, 02-09-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :119 Issue : 119 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in
7207282727 | 72707292727



## ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదు

6




ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే

## బలమైన భారత్ నిర్మాణం

- పోషకాహారమే దేశ నిర్మాణానికి పునాది: డా. కె. లక్ష్మణ్

5



## గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

- రాష్ట్రంలో అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్
- పర్యావరణహిత వేడుకలకు ప్రాధాన్యం
- రక్షణ, పారిశుద్ధ్యం, వైద్యసేవలు నిరంతరం అందుబాటులో వుండాలి
- సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం

3

## ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం

3


# కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు



- కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలపై అధిష్ఠానం దృష్టి
- వేణుగోపాల్‌తో గంటకుపైగా రేవంత్ భేటీ
- మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపైనా చర్చ
- నామినేటెడ్ పోస్టుల భర్తీపై సమాలోచనలు
- అధిష్ఠానానికి టీపీసీసీ నివేదిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారాలపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్‌రెడ్డి గంటకుపైగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన, ఇటీవల చోటుచేసుకున్న

మిగతా 2వ పేజీలో..



## 'ఫీజు' బకాయిలు తక్షణం విడుదల చేయాలి

- మాజీ మంత్రి హరీష్‌రావు డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 , ఆశ్వి అప్డేట్స్:** ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థ అని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెలలు గడుస్తున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ టి.హరీష్‌రావు శనివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. గత రెండున్నరేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ,

మిగతా 2వ పేజీలో..



## యధావిధిగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్

- సింగిల్ బెంచ్ తీర్పుపై హైకోర్టు స్టే



**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :** కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం

మిగతా 2వ పేజీలో..

## నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ



- బాధిత కుటుంబానికి మంత్రి సీతక్క పరామర్శ

**కొత్తగూడెం, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:** తుక్కుగూడలో దారుణ హత్యాచారానికి గురైన నర్సు ఉకే శిరీష కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ

మిగతా 2వ పేజీలో..



## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై 'సడక్ సే సదన్ తక్' పోరు

- రాంచందర్ రావుతో బీజేపీ నితిన్ నబీన్ ఫోన్ సంభాషణ

2



## తెలంగాణలో వర్షా ల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు

2

## మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్ధిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ



2

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు నైనీ బొగ్గు తొలి రేక్

3






2

## 'శుద్ధీకరణ' పేరిట దళిత ఆత్మగౌరవంపై దాడి

- ఉత్తరాఖండ్ ఘటనపై మంత్రి ఉత్తమ్ తీవ్ర ఆగ్రహం



## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

- అనవసరంగా బంగారాన్ని కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- ఇన్‌స్టా వేదికగా ప్రజలకు ప్రధాని మోదీ అభినందనలు

6



## క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

- క్రిటికల్ మినరల్స్ పరిశోధనకు త్రిముఖ భాగస్వామ్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు

మొదటిపేజీ తరువాయి

రాజకీయ పరిణామాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కొండా సురేఖ, చిన్నారెడ్డి అంశాలతో పాటు మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా చర్చించినట్లు తెలుస్తోంది.

**వేణుగోపాల్‌తో సురేఖ భేటీ**

కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి రావాలని సూచించడంతో మంత్రి కొండా సురేఖ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ఆమె సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా సురేఖ కోరినట్లు సమాచారం. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీలో ఉన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఢిల్లీలో ఉన్నట్లు సమాచారం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇవాళ రాత్రి లేదా బుధవారం ఉదయం ఢిల్లీకి వెళ్లే అవకాశం ఉంది.

**అధిష్ఠానానికి నివేదిక**

ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో చర్చకు దారితీశాయి. దీనిపై వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె తన వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖ వ్యవహారంతో పాటు వనపర్తి అంశంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన నివేదికను టీపీసీసీ అధిష్ఠానానికి పంపినట్లు సమాచారం.

**నిర్ణయంపై ఉత్కంఠ**

ఈ పరిణామాల నేపథ్యంలో కొండా సురేఖ ఢిల్లీ పర్యటనకు ప్రాధాన్యం ఏర్పడింది. వేణుగోపాల్‌తో భేటీలో ఆమె వివరణను అధిష్ఠానం పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## ‘ఫీజు’ బకాయిలు తక్షణం
# విడుదల చేయాలి

మొదటిపేజీ తరువాయి

పీజీ కళాశాలలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో 960గా ఉన్న ప్రైవేట్ డిగ్రీ కళాశాలల సంఖ్య ప్రస్తుతం 650కి పడిపోయిందని, ఇప్పటికే సుమారు 310 కళాశాలలు మూతపడ్డాయని తెలిపారు. అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బందికి 5 నుంచి 10 నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ డిగ్రీ & పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తమను కలసి వినతిపత్రం అందజేశారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు, కరోనా కష్టకాలంలోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపలేదని, తొమ్మిదిన్నరేళ్లలో రూ.19,500 కోట్లు విడుదల చేసిందని గుర్తుచేశారు.

**అసెంబ్లీని స్తంభింపజేస్తాం**

ఎలక్షన్ మేనిఫెస్టోలో పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని చెప్పి మూడు బడ్జెట్లు మారినా ఇప్పటికీ దాదాపు రూ.10,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, ప్రతీ విద్యాసంవత్సరం నిర్ణీత గడువులోగా నిధులు విడుదల చేసేలా శాశ్వత విధానాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. బకాయిలు విడుదల చేయకపోతే వచ్చే అసెంబ్లీ సమావేశాలను స్తంభింపజేస్తామని హరీష్‌రావు హెచ్చరించారు.

## యధావిధిగా కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్

మొదటిపేజీ తరువాయి

2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాక పథకం లబ్దిదారు కూడా కాదని అన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమని చెప్పారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందని అన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## ‘శుద్ధీకరణ’ పేరిట దళిత
# ఆత్మగౌరవంపై దాడి

హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:

ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికను శుద్ధి చేయడం కోట్లాది దళితుల ఆత్మగౌరవంపై జరిగిన ఘోర దాడి అని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖర్గే ప్రసంగించిన వేదికపై శ్రీరామ్ సేన సభ్యులు ‘శుద్ధీకరణ’ నిర్వహించడాన్ని అంటరానితనానికి మరో రూపంగా అభివర్ణిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై ఉత్తమ్ మండిపడ్డారు. తప్పు చేసిన వారిని పక్కన పెట్టి సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని, న్యాయాన్ని తలకిందులు చేయడమేనని విమర్శించారు. ప్రస్తుతం దేశంలో జరుగుతున్నది కాంగ్రెస్‌బీజేపీల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగ సమానత్వానికి, సామాజిక వివక్షకు మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంగ్రామమని మంత్రి అభివర్ణించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రతిపక్షాలను భయపెట్టేందుకు వ్యవస్థలను రాజకీయ ఆయుధాలుగా వాడుతున్నారని ఆరోపించారు. ఎన్ని ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం సాగిస్తున్న పోరాటాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేశారు. వేదికలను కాదు, సమాజంలో ఇంకా మిగిలి ఉన్న వివక్షాపూరిత మనస్తత్వాన్ని శుద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.



# తెలంగాణలో వర్షాల లోటు

- మూడు నెలల్లో 20 శాతం తక్కువ వర్షపాతం
- ఆగస్టులో ఏకంగా 42 శాతం లోటు
- 19 జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు
- సెప్టెంబర్‌పైనే రైతుల ఆశలు
- ఉష్ణోగ్రతలు 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం



హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో ఈ ఏడాది వర్షాకాలం ఆశించిన స్థాయిలో సాగడం లేదు. జూన్ నుంచి ఆగస్టు వరకు మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా సాధారణంగా 581 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 462 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైంది. దీంతో సుమారు 20 శాతం వర్షపాతం లోటు ఉన్నట్లు వాతావరణ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వర్షాల కొరతతో సాగు, తాగునీరు, భూగర్భ జలాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**ఆగస్టులో భారీ లోటు**

నెలల వారీగా చూస్తే జూన్‌లో సాధారణం కంటే 8 శాతం, జూలైలో 10 శాతం వర్షపాతం లోటు నమోదైంది. ఆగస్టులో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. ఆ నెలలో ఏకంగా 42 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు గణాంకాలు సూచిస్తున్నాయి.

**19 జిల్లాల్లో లోటు**

రాష్ట్రంలోని జిల్లాల వారీ పరిస్థితిని పరిశీలిస్తే 13 జిల్లాల్లో మాత్రమే సాధారణ స్థాయి వర్షపాతం నమోదైంది. మరో 19 జిల్లాల్లో తీవ్ర వర్షపాతం లోటు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కామారెడ్డి జిల్లాలో మాత్రం సాధారణం కంటే 25 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మిగిలిన ప్రాంతాల్లో వర్షాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది.

**సెప్టెంబర్‌పైనే ఆశలు**

వర్షాకాలంలో చివరి నెల అయిన సెప్టెంబర్‌పైనే రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఈ నెలలోనూ వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసే అవకాశం లేదని వాతావరణ అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 నుంచి 40 శాతం వరకు వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

**ఎండల ప్రభావం కూడా**

మరోవైపు వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా సెప్టెంబర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా. దీంతో సెప్టెంబర్‌లోనూ ఎండ తీవ్రత కొనసాగే పరిస్థితులు కనిపించవచ్చని పేర్కొంటున్నారు.

**వాతావరణ వ్యవస్థలపైనే ఆధారం**

సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 1.5 డిగ్రీలు దాటడం, ఎల్‌నినో ప్రభావం తీవ్రతరం కావడం వంటి పరిణామాలు వాతావరణ పరిస్థితులపై ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశాలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే బంగాళాఖాతంలో అల్పపీడనం లేదా ఇతర వాతావరణ వ్యవస్థలు ఏర్పడితే తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. సెప్టెంబర్‌లో వర్షాల పరిస్థితి రానున్న రోజుల్లో ఏర్పడే వాతావరణ వ్యవస్థలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొంటున్నారు.

# క్రిటికల్ మినరల్స్‌పై తెలంగాణ ఫోకస్

హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :



క్రిటికల్ మినరల్స్, ఖనిజ అన్వేషణ, అధునాతన ఖనిజ సాంకేతికతల రంగాల్లో దీర్ఘకాలిక పరిశోధన, సంస్థాగత భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మోనాష్ యూనివర్సిటీ డీన్, ఇతర ఉన్నతాధికారులతో మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమావేశమయ్యారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో పరిశోధనను వేగవంతం చేయడంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ భారత్ పునరుత్పాదక ఇంధన రంగాన్ని విస్తరిస్తున్న తరుణంలో క్రిటికల్ మినరల్స్ ప్రాధాన్యం పెరుగుతోందన్నారు. తెలంగాణ వీటికి వినియోగదారుగా మాత్రమే ఉండకూడదని, మొత్తం విలువ శృంఖలిలో కీలక భాగస్వామిగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ భాగస్వామ్యాన్ని కేవలం పరిశోధనకే పరిమితం చేయకుండా వాణిజ్య స్థాయిలో విస్తరించగల సాంకేతికతల అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ భాగస్వామ్యానికి సంబంధించిన కార్యాచరణను త్వరగా రూపొందించాలని అధికారులను కోరారు. తెలంగాణను క్రిటికల్ మినరల్స్ పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలు అందిస్తుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఐఐటీ హైదరాబాద్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను బలోపేతం చేసి అధునాతన పరిశోధన, సాంకేతిక అభివృద్ధికి వేదికగా మలచాలని చెప్పారు. మోనాష్ యూనివర్సిటీ, ఐఐటీ హైదరాబాద్, సింగరేణి సంస్థలను సమన్వయం చేయడం ద్వారా ఖనిజాల అన్వేషణ, మినరల్స్ వెలికితీత, శుద్ధి సాంకేతికతలు, వ్యర్థాల నుంచి క్రిటికల్ మినరల్స్‌ను తిరిగి పొందే విధానాలపై దృష్టిపెట్టాలని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. పునరుత్పాదక ఇంధనం, విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు అవసరమైన ముడి పదార్థాల కొరతను అధిగమించడానికి ఈ భాగస్వామ్యం దోహదపడుతుందని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణభాస్కర్, మోనాష్ యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ యాయిన్నిస్ వెంటికోస్, ఆస్ట్రేలియాఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ మోహన్ ఎల్లిషెట్టి, ప్రొఫెసర్ రామన్ సింగ్, సింగరేణి సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ దాడి సంస్కృతిపై ‘సడక్ సే సదన్ తక్’ పోరు

హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:

తెలంగాణలో బీజేపీ నేతలు, కార్యాలయాలపై జరుగుతున్న దాడుల ఘటనలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఆయన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల వైఫల్యాలను ఎండగడుతున్నందుకే ఓర్వలేక పార్టీపై దాడులకు తెగబడుతున్నారని రామచందర్ రావు వివరించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంతోపాటు నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు చేసిన దాడుల వివరాలను నబీన్‌కు తెలియజేశారు. బాధితుడు వర్షిత్ రెడ్డిని పరామర్శించేందుకు వెళ్తుంటే తనను హౌజ్ అరెస్ట్ చేసి అనంతరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించిన తీరును వివరించారు. ఘటనల వివరాలు తెలుసుకున్న నితిన్ నబీన్ రాష్ట్రంలో బీజేపీ శ్రేణుల ధైర్యాన్ని ప్రశంసించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న రాష్ట్ర నాయకత్వానికి, కార్యకర్తలకు పార్టీ పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ దాడులకు భయపడేది లేదని, ‘సడక్ సే సదన్ తక్’ (రోడ్డు నుండి అసెంబ్లీ వరకు) పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా, దాడికి గురైన నాగం వర్షిత్ రెడ్డితో కూడా నబీన్ త్వరలోనే ఫోన్ ద్వారా మాట్లాడి పరామర్శించనున్నారు.

# నర్సు శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండ

మొదటిపేజీ తరువాయి



(సీతక్క) హామీ ఇచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంలోని శిరీష స్వగ్రామానికి వెళ్లిన మంత్రి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మహిళా కమిషన్ సభ్యురాలు నునావత్ రాధాబాయితో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష**

ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు స్వయంగా వచ్చినట్లు మంత్రి సీతక్క తెలిపారు. నిందితుడిని పోలీసులు వేగంగా అరెస్టు చేశారని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పేద ఆదివాసీ కుటుంబానికి చెందిన శిరీష నర్సుగా పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్న సమయంలో ఇలాంటి దారుణం జరగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఆర్థిక సాయం, పునరావాస హామీలు**

బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణ సహాయంగా రూ.5 లక్షల చెక్కుతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి రూ.లక్ష, ఐటీడీఏ నుంచి రూ.30 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక తాను, ఎమ్మెల్యే ఆదినారాయణ కలిసి వ్యక్తిగతంగా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశామన్నారు. బాధితులకు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద పరిహారంతోపాటు ఇందిరమ్మ ఇల్లు, సాగుభూమి, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నగరాలకు వచ్చే గ్రామీణ, ఆదివాసీ యువతుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని, అత్యవసర సాయం కోసం ప్రత్యేక కాల్ సెంటర్ ఏర్పాటునూ పరిశీలిస్తామని వెల్లడించారు.

# మైనారిటీ మహిళల ఆర్థిక బలోపేతానికి కృషి

- మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల
- లబ్దిదారులకు మహిళా యోజన చెక్కుల పంపిణీ

మేడ్చల్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :

మైనారిటీ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలపడేందుకు ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన ద్వారా పొందే ఆర్థిక సహాయం ఎంతగానో దోహదపడుతుందని ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాలు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దీళ్ళ శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, హజ్ కమిటీ సభ్యుడు మహమ్మద్ ముజుబుద్దీన్, మైనారిటీ ఫైనాన్స్ చైర్మన్ ఒబెదుల్ల కొత్వాల్, జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలనే ముఖ్యమంత్రి ఆలోచనే ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన అని తెలిపారు. స్వయం ఉపాధి, చిన్న వ్యాపార కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా మైనారిటీ మహిళలు ఆర్థికంగా స్వతంత్రులుగా ఎదగగలరన్నారు. ఈ పథకం కింద మేడ్చల్ జిల్లాలో 225 మంది మైనారిటీ మహిళా లబ్దిదారులు ఒక్కొక్కరికి రూ.50వేల చెక్కును అందించారు. తుర్క కాశి ముస్లిం వర్గానికి కుల వృత్తికి ఉపయోగపడే రూ.60 వేల విలువ చేసే జనరేటర్ టూల్ కిట్‌లను 57మంది లబ్దిదారులకు పంపిణీ చేశారు. రేవంత్ అన్నాకా సహారామిస్కినో కేలియే పథకం కింద మైనారిటీల జీవనోపాధికి అవసరమైన రూ.లక్ష విలువైన మోపెడ్‌లను, స్వయం ఉపాది కింద మహిళలకు కుట్టు మిషన్ లు అందజేశారు. మత, సామాజిక, మౌలిక సదుపాయాల కోసం ఆర్థిక సహాయం, విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించడానికి ముఖ్యమంత్రి ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం ద్వారా మైనారిటీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్థిక చేయూత అందించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయస్థాయి వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిష్ఠాత్మకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నదన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసి అందరికీ సన్న బియ్యం అందచేస్తున్నదన్నారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా నైపుణ్యం అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. అనంతరం లబ్దిదారులకు చెక్కుల పంపిణీ, జనరేటర్ అండ్ టూల్ కిట్ అందచేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ చైర్మన్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, ఆర్టీయే సభ్యుడు, మున్సిపల్ చైర్‌పర్సన్స్, టీజీఎల్‌డీఏ చైర్మన్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కాంతమ్మ, ప్రజాప్రతినిలు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టాం

- కారుణ్య నియామకాలు జరిపాం
- వాహన్ సారథి తీసుకొచ్చాం
- వెయ్యి రోజుల పాలనపై రవాణా శాఖ మంత్రి పొన్నం

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :**

ఆర్టీసీలో విప్లవాత్మక మార్పులు చేపట్టామని, తమ ప్రభుత్వం వచ్చిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించామని, ఇప్పటివరకు 347.36 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేయగా వారు రూ.12,167 కోట్లు ఆదా చేసుకున్నారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమంతోపాటు సంస్థ ప్రగతిని ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి వెయ్యి రోజులు అవుతున్న సందర్భంగా బస్ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆర్టీసీ, రవాణా శాఖ విజయాలు, ప్రగతి గురించి వివరించారు. దేశంలో మొదటిసారిగా 600 బస్సులకు మహిళలను యజమానులను చేశామన్నారు. ప్రతి బస్సుకు రూ.69,468లు, నెలకు రూ.4 కోట్లు ఈఎంఐ చెల్లిస్తున్నామని, ఇప్పటివరకు రూ.29.31 కోట్లు చెల్లించామని చెప్పారు. గతంలో ఆక్యుపెన్సీ 67 శాతం ఉంటే ఇప్పుడు 89 శాతం పెరిగిందన్నారు.

**ఈవీ బస్సులు, నియామకాలు**

సర్వీసు నుండి తొలగింపునకు గురైన దాదాపు 244మంది ఉద్యోగులను ప్రత్యేక ఐఏఎస్ కమిటీ ద్వారా తిరిగి విధుల్లోకి తీసుకున్నామని, 1,424 కారుణ్య నియామకాలు చేపట్టామని చెప్పారు. 2,932 కొత్త బస్సులు కొనుగోలు చేశామని, పీఎం డ్రైవ్ కింద హైదరాబాద్‌లో 1,024 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా నడుస్తున్నాయని, నగరంలో మరో 2,200 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కబోతున్నాయని చెప్పారు. ఎంఎంటీఎస్, మెట్రో, ఆర్టీసీ సమన్వయంతో లాస్ట్ మైల్ వరకు కనెక్టివిటీ అమలు చేస్తామన్నారు. ఎలక్ట్రానిక్ టిమ్‌ల ద్వారా టికెట్ జారీ చేస్తున్నామన్నారు. తార్నాక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి చేశామని, ఆర్టీసీ శ్రామికులకు రెండు పీఆర్సీలు ఇచ్చామని, 5 డీఏలు ఇచ్చామని, డీఏలు పెండింగ్‌లో లేవని వివరించారు. యూనియన్ ఎన్నికలు జరుపుతున్నామని, తరువాత విలీనం ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పారు. బస్ స్టేషన్‌లను ఆధునికీకరిస్తున్నామని, పెద్దపల్లి, ఏటూరునాగారం డిపోలు ఇచ్చామని, సీసీఎస్ బకాయిలు రూ.1096 కోట్ల నుండి రూ.939 కోట్లకు తగ్గించామని, పీఎఫ్ బకాయిలు రూ.2108 కోట్ల నుండి రూ.1710 కోట్లకు తగ్గించామని, ఎసఆర్‌బీఎస్, ఎస్‌బీటీ బకాయిలు రూ.513 కోట్ల నుండి రూ.485 కోట్లకు తగ్గించినట్లు వివరించారు. 4,538 ఉద్యోగాలకు నోటిఫికేషన్



ఇచ్చామని, వెయ్యి డ్రైవర్, 743 శ్రామిక పోస్టుల నియామకాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో నియామక పత్రాలు అందిస్తామని తెలిపారు. 1500 కండక్టర్ నియామకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, ఎక్కడా పొరపాటు జరగకుండా పారదర్శకంగా పోలీస్ శాఖ ద్వారా నియామకాలు చేపట్టామని చెప్పారు. 240 డీజిల్ బస్సులు రిట్రోఫిట్మెంట్ చేస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలకు బస్ స్టేషన్లు ఆధునికీకరిస్తున్నామని, భక్తుల రద్దీకి తగ్గట్టు బస్సులు నడుపుతామని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కొత్త రూట్లు అడిగితే బస్సులు వేస్తున్నామని, హైదరాబాద్‌లో 370 కొత్త రూట్లలో నడిపిస్తున్నామని, గ్రామాల్లో కూడా బస్ రూట్లు లేని ప్రాంతాల్లో బస్సులు నడిపిస్తున్నామని మంత్రి పొన్నం చెప్పారు. దేశంలో నంబర్ 1గా ఆర్టీసీ ఎదుగుతుందన్నారు. ప్రతి నెలా మంగళవారం కార్మికుల గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని, వారి సమస్యలు పరిష్కరిస్తున్నామని, రోడ్ సేఫ్టీ సెస్ రోడ్డు భద్రతకు ఉపయోగించుకునేలా చట్టం చేసుకుని ముందుకు పోతున్నామని తెలిపారు. నగరంలో కొన్ని రూట్లలో నైట్ బస్సులు నడుస్తున్నాయని మంత్రి పొన్నం చెప్పారు.

**ఈవీ పాలసీ**

హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈవీ పాలసీ తెచ్చామని, రూ.1400 కోట్ల పన్ను మినహాయింపు ఇచ్చామని మంత్రి చెప్పారు. హైదరాబాద్‌లో ఆటోలను రిట్రోఫిట్మెంట్ చేయడానికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు సహాయం అందిస్తుందన్నారు. రవాణా శాఖ చెక్‌పోస్టులు ఎత్తివేసిందని, జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంలు పెంచామని, టీఎస్‌ను టీజీగా మార్చుకున్నామని చెప్పారు. వాహన అండ్ సారథి తీసుకొచ్చామని, స్క్రాప్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనలతో వాహన సారథిలో చేరామన్నారు. ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్టులు ప్రారంభిస్తున్నామన్నారు. రవాణా శాఖలో 113 ఏఎంవీఐలు, 50 మంది కానిస్టేబుల్, 20 మంది జూనియర్ అసిస్టెంట్, నలుగురు ఎంవీఐలను నియమించామని, రోడ్ సేఫ్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అరైవ్ అలైవ్ పేరుతో పోలీస్ శాఖ ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టామని, రహవీర్ స్కీమ్ అమలు చేస్తున్నామని వివరించారు.

# గణేష్ ఉత్సవాలు శోభాయమానంగా నిర్వహించాలి

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**

గణేష్ నవరాత్రి ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా నిర్వహిస్తామని రవాణా బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. వచ్చే గణేష్ నవరాత్రి ఉత్సవాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో ఘనంగా, సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కలసి పనిచేయాలని సంబంధిత శాఖల ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. జూబ్లీహిల్స్‌లోని డాక్టర్ ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో గణేష్ ఉత్సవ వేడుకలు2026 ఉన్నతస్థాయి సన్నాహక సమన్వయ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తోందని, మండపాల నిర్వాహకులు నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. హైదరాబాద్‌లో సుమారు 47 సంవత్సరాలుగా కొనసాగుతున్న గణేష్ ఉత్సవాల సంప్రదాయాన్ని దృష్టిలో ఉంచుకుని గత అనుభవాల్లో ఎదురైన సమస్యలు, లోపాలను ముందుగానే గుర్తించి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, ఉత్సవాలు, నిమజ్జన ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తం గా ఉండాలని సూచించారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. షీ టీమ్స్, యాంటీథెఫ్ట్ నిఘా బృందాలను వినియోగించడంతోపాటు శాంతిభద్రతలు, మత సామరస్యాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించి పార్కింగ్ ప్రదేశాలు, ట్రాఫిక్ మళ్లింపులు, ట్రాఫిక్ వాలంటీర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖలు 24 గంటలపాటు పారిశుధ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని, వీధి దీపాలను సక్రమంగా నిర్వహించాలని, బేబీ పాండ్ల నిర్మాణం, నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఫాగింగ్, బయో టాయిలెట్ల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కొత్తగా ప్రారంభించిన మున్సిపల్ కార్పొరేషన్ల లోగోలను విస్తృతంగా ప్రదర్శించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కీలక ప్రాంతాల్లో 24 గంటల వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలతోపాటు ప్రథమ చికిత్స సామగ్రి, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, అంబులెన్సులు, షిఫ్ట్‌ల వారీగా వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ మౌలిక వసతులను ముందస్తుగా తనిఖీ చేసి విద్యుత్ భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకుని, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

రవాణా శాఖ, టీజీఎస్‌ఆర్టీసీ ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉన్న బస్సులను మాత్రమే వినియోగించాలని, భక్తుల రద్దీకి అనుగుణంగా దాదాపు 700 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని అవసరమైన మార్గ మళ్లింపులు చేపట్టాలని, మొబైల్ బ్రేక్‌డౌన్ రిలీఫ్ వాహనాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. హైదరాబాద్ మెట్రో రైల్ సేవలను అవసరానికి అనుగుణంగా పొడిగించాలని, రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని, ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించాలని, స్టేషన్లలో స్పష్టమైన సూచికలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖలు నిమజ్జన ప్రాంతాల్లో శిక్షణ పొందిన గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని మంత్రి ఆదేశించారు. టూరిజం శాఖ ఆధ్వర్యంలో అవసరమైన ప్రాంతాల్లో లైఫ్‌బోట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ బేబీ పాండ్లలో పూడిక తొలగింపు పనులు చేపట్టి నీటి నాణ్యతను, ఇతర అవసరమైన ఏర్పాట్లను నిర్ధారించాలని ఆదేశించారు. ఎండోమెంట్స్, సాంస్కృతిక, సమాచార పౌర సంబంధాల శాఖలు మట్టి విగ్రహాలు, గణేష్ ఉత్సవాల ప్రచురణలు చేపట్టి ప్రజలలో మరింత అవగాహన కల్పించాలని సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో సాంస్కృతిక బృందాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు చేయాలని, ఉత్సవాలపై విస్తృత ప్రచారం చేయాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించాలని మంత్రి సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు డీజేల వినియోగంపై ఉన్న నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని, శాంతిభద్రతలు, ప్రజా భద్రత, మత సామరస్యాన్ని కాపాడేందుకు అధికారులు, నిర్వాహకులకు పరస్పర సహకారం అలాగే అందరి భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షించాలని, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు. ముందస్తు ప్రణాళిక, సమర్థవంతమైన సమన్వయం, సకాలంలో సమస్యల పరిష్కారంతో గణేష్ ఉత్సవాలు విజయవంతంగా జరిగేలా చూడాలని సూచించా రు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, రఘువీర్ రెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి; డీజీపీ సీవీ ఆనంద్, ఏడీజీపీ మహేష్ భగవత్, పోలీస్ కమిషనర్లు సజ్జనార్, రమేష్, సుమతి, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయెల్ డేవిస్, సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్లు కర్ణన్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి; హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, ఎండోమెంట్స్ కమిషనర్ హనుమంతరావు, ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ, టూరిజం ఎండీ గౌతమి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ జాయింట్ ఎండీ మయాంక్ మిట్టల్, సాంస్కృతిక శాఖ సంచాలకులు నరసింహారెడ్డి, ఐ&పీఆర్ అదనపు సంచాలకుడు డి.ఎస్. జగన్, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ వెంకటరమణ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి కార్యదర్శి శశిధర్ రెడ్డి, సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## యాదాద్రి పవర్ స్టేషన్‌కు

# నైనీ బొగ్గు తొలి రేక్

**దామరచర్ల, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**

యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) విద్యుత్ ఉత్పత్తి దిశగా ఒక కీలక మైలురాయిని అధిగమించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) ఆధ్వర్యంలో నడుస్తున్న ఒడిశాలోని నైనీ గని నుండి సేకరించిన అత్యంత నాణ్యమైన 4,000 టన్నుల బొగ్గుతో కూడిన మొదటి రైల్వే రేక్ మంగళవారం ప్లాంట్‌కు చేరుకుంది. ఈ తొలి బొగ్గు రేక్‌కు టీజీజెన్‌కో డైరెక్టర్లు బి.నాగ్య (బొగ్గు & లాజిస్టిక్స్), వై.రాజశేఖర్ రెడ్డి (థర్మల్ & ప్రాజెక్ట్స్) అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఒడిశాలోని నైనీ బ్లాక్ నుండి సుమారు 1,050 కిలోమీటర్ల దూరం రవాణా అయిన ఈ అధిక నాణ్యత గల బొగ్గు వల్ల బాయిలర్ల పనితీరు మెరుగవడమే కాక బూడిద సమస్యలు తగ్గి ప్లాంట్ గరిష్ట సామర్థ్యంతో పనిచేసేందుకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేక చొరవతో టీజీజెన్‌కో, సింగరేణి, రైల్వేల సమన్వయంతో ఈ సుదూర రవాణా ప్రక్రియ సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరగడం వల్ల రాష్ట్రానికి నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుతుందని స్పష్టం చేశారు.



# వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ పరిశీలన

- భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు పకడ్బందీ ప్రణాళిక

**ఖమ్మం, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

ఖమ్మం నగరంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్నేరు నదిలో ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉండటంతో నిమజ్జనానికి ప్రత్యామ్నాయంగా అనువైన చెరువులను మంగళవారం పరిశీలించారు. సంబంధిత పోలీస్ అధికారులు, సంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి నిమజ్జనానికి అనువైన ప్రాంతాలను సందర్శించిన కమిషనర్, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా ఖమ్మం అర్బన్ మండలం దంసలాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తూరు చెరువును సందర్శించారు.

వినాయక నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. విగ్రహాల తరలింపు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, భక్తుల భద్రత తదితర అంశాలపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా జరిగేలా పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తుందని కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, టౌన్ ఏసీపీ రమణమూర్తి, ఎస్బీ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్లు మోహన్ బాబు, భానుప్రకాష్, సంభాద్రి ఉత్సవ కమిటీ ప్రతినిధులు వినోద్ లాహూటి, విద్యాసాగర్, శ్రీహరి, ప్రసన్నకృష్ణ, సుధాకర్, యుగేందర్ శర్మ, సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి: బీఆర్ఎస్ నేతలు

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 01 | ఆశ్వి అప్డేట్స్**




వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి దళితులకు చెందిన లావణి పట్టా భూమిని నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట మార్చుకున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ కృష్ణానాయక్, దొడ్ల రాములు, జాత్రు నాయక్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలుటూరు శివారులోని సర్వే నంబర్ 517/A2లో 0.39 గుంటల నిషేధిత లావణి పట్టా భూమిని అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎమ్మెల్యే తన పేరిట మార్పించుకున్నారని ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్‌లోనూ ఆ భూమిని 'పట్టా' భూమిగా చూపడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. అలాగే దోడగుంటపల్లి-అంకూరు మధ్య ప్రథమేష్ సోలార్ ప్లాంట్‌కు సంబంధించి దళితులకు చెందిన 5 ఎకరాల 10 గుంటల లావణి పట్టా భూమిని దారిమళ్లించేందుకు మధ్యవర్తిగా వ్యవహరించి భారీగా కమిషన్లు తీసుకున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ జిల్లా ఎస్పీ, కలెక్టర్‌లకు వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. భూ వ్యవహారంలో ఎమ్మెల్యేకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్‌రిజిస్ట్రార్, తహసీల్దార్‌లపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత మూడేళ్లుగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన ఆరోపణలను నిరూపించలేకపోయారని, అందుకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన ప్రజా వంచనే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తీవ్ర ధ్వజం

**హైదరాబాద్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**

రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసుకున్న వెయ్యి రోజుల పాలన ప్రజా పాలన కాదని, అది ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్గొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణుల దాడుల నేపథ్యంలో ఆయనను పరామర్శించేందుకు వెళ్తుంటే మంగళవారం హౌజ్ అరెస్ట్ చేసి గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను, గ్యారెంటీలను విస్మరించి రాష్ట్ర ప్రజలను దయనీయ స్థితిలోకి నెట్టారని విమర్శించారు. క్షేత్రస్థాయిలో ఈ రోజుల వెయ్యి పాలన ప్రజలకు ఏమి ఇచ్చిందో పరిశీలిస్తే నేడు తెలంగాణ అత్యంత ఆందోళనకరమైన, దయనీయమైన స్థితిలో కొట్టుమిట్టాడుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోంది అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన అనేక వాగ్దానాలు, గ్యారెంటీలలో ఇప్పటివరకు అమలైనవి ఎన్ని.. నెరవేర్చిన హామీలు ఏవి అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

**రైతులు, నిరుద్యోగులకు ద్రోహం**


రుణమాఫీకి ₹40,000 కోట్లు అవసరమైతే కేవలం ₹18,000 కోట్లతో చేతులు దులుపుకున్నారని, రైతు భరోసాను ₹15,000 నుంచి ₹12,000 కు తగ్గించి బకాయిలు పెట్టారని మండిపడ్డారు. కౌలు రైతుల సమస్యలు పట్టించుకోలేదని, ₹500 ధాన్యం బోనస్ హామీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు. మొదటి 100 రోజుల్లో లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,000 ఉద్యోగాలతో యువతను మోసం చేశారని రామచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఉద్యోగులు, విద్యార్థుల రోదన**

ఉచిత స్కూటర్లు, మహిళలకు ₹2,500 సాయం, పసిడి హామీలు ఎటు పోయాయని ప్రశ్నించారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పెన్షన్లు ఇవ్వకపోగా, పీఆర్సీ అమలును నిర్లక్ష్యం చేశారన్నారు. సుమారు ₹15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**డిక్లరేషన్ల పేరుతో మోసం**

బీసీ సంక్షేమం అన్నారు, ఎస్సీ డిక్లరేషన్ అన్నారు, రైతు డిక్లరేషన్ అన్నారు.. సమాజంలోని అన్ని వర్గాలకు కొండంత ఆశలు చూపించారు. ఆ డిక్లరేషన్లు, కమిట్‌మెంట్లు ఇప్పుడు ఎక్కడికి పోయాయని నిలదీశారు.



ఈ 1,000 రోజుల్లో ప్రజలకు మీరు చెప్పింది 1,000 అబద్ధాలు మాత్రమే. ఇది ప్రజా పాలనః కాదు.. ముమ్మాటికీ ప్రజా వంచన పాలన అని అన్నారు.

**హైదరాబాద్‌పై కొత్త భారాలు – శాంతిభద్రతలు కుదేలు**

నగర ప్రజలను భయాందోళనలకు గురిచేయడానికి హైడ్రా, అనిశ్చితికి హిల్ట్, కొత్త పన్నుల వసూళ్లకు క్యూర్ తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, ప్రశ్నించే ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ ఎమర్జెన్సీ వాతావరణాన్ని గుర్తు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకే నాణేనికి రెండు ముఖాలని అభివర్ణించిన ఆయన తమపై అక్రమ కేసులు పెట్టినా, జైళ్లకు పంపినా, అరెస్టులు చేసినా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ దాడుల సంస్కృతికి భిన్నంగా ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని, ప్రజలను ఏకం చేసి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ నిరంతరం పోరాటం సాగిస్తుందని రామచందర్‌రావు స్పష్టం చేశారు.



# మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**నారాయణపేట, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నారాయణపేట టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. మంగళవారం నారాయణపేట పట్టణంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ ఉపయోగించకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. మైనర్ డ్రైవింగ్ కారణంగా ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని మైనర్లకు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్, అతివేగం, ర్యాష్‌డ్రైవింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా నివారించవచ్చని తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.




# రాహుల్ గాంధీపై కేసులకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

- **బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోంది: పున్న కైలాష్ నేత**

**నల్గొండ, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

రాహుల్ గాంధీపై ఉత్తరాఖండ్‌లో కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు నల్గొండలో కాంగ్రెస్ నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత ఆధ్వర్యంలో క్లాక్ టవర్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టడం బీజేపీ కుట్రపూరిత రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును అణచివేయడం సరికాదని విమర్శించారు. 2029లో రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

**కేసీఆర్ రాజీనామా చేయాలి**

ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై స్పందించకుండా కేసీఆర్ ఫామ్‌హౌస్ రాజకీయాలు చేస్తున్నారని పున్న కైలాష్ నేత విమర్శించారు. కేసీఆర్ వెంటనే ప్రతిపక్ష నేత పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజాపాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్, ఓబీసీ సెల్, INTUC ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# మహబూబ్‌నగర్ సమగ్ర అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే యెన్నం

- **రూ.603 కోట్లతో యూజీడీ పనులకు భూమిపూజ.. మూడేళ్లలో నగరమంతా పూర్తి చేస్తాం**

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

మహబూబ్‌నగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో రూ.603 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనులకు భూమిపూజ చేయనున్నట్లు తెలిపారు. విడతల వారీగా పనులు చేపట్టి రాబోయే మూడేళ్లలో నగరమంతా యూజీడీ పూర్తి చేస్తామని చెప్పారు. మురుగునీటిని శుద్ధి చేసిన అనంతరం మాత్రమే బయటకు విడుదల చేసేలా ఎస్టీపీలను ఏర్పాటు చేస్తామన్నారు.

తాగునీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేసేందుకు 14 వాటర్ రిజర్వాయర్లకు అనుమతి లభించిందని, ఇప్పటికే 11 రిజర్వాయర్లకు శంకుస్థాపన పూర్తయిందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 20 ఎంఎల్‌డీ సామర్థ్యానికి అదనంగా మరో 18 ఎంఎల్‌డీ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు పేర్కొన్నారు. ముడా నిధులతో రూ.1.50 కోట్లతో ట్యాంక్‌బండ్ సుందరీకరణ పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

విద్య, వైద్యం, రహదారులు, విద్యుత్, పారిశుద్ధ్యంతో పాటు పిల్లల విద్య, ఆరోగ్యం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గత ఏడాది 35 మంది వాలంటీర్లతో 30 పాఠశాలల్లో చేపట్టిన విద్యా కార్యక్రమాలను ఈ ఏడాది 100 మంది విద్యా వాలంటీర్లతో మరిన్ని పాఠశాలలకు విస్తరిస్తామని చెప్పారు.

"పదవుల కంటే మహబూబ్‌నగర్ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. ఎన్నికల కోసం మాత్రమే ఆలోచించేవాడు నాయకుడు కాదు.. రాబోయే తరాల కోసం ఆలోచించేవాడే ప్రజానాయకుడు" అని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.

ప్రజల ప్రస్తుత అవసరాలతో పాటు భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, రాజకీయాలకు అతీతంగా నగర అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



# యాదాద్రి భువనగిరి జిల్లా TGPOA కమిటీ ఏర్పాటు

- **పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన లక్ష్యం.. నూతన కమిటీకి ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అభినందనలు**

**యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**




తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (TGPOA) ఎన్నికలు-2026లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఏర్పాటైంది. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, సమిష్టి ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని మూడు పోలీస్ డివిజన్లకు చెందిన వివిధ హోదాలు, విభాగాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ దశలవారీగా ఎన్నికలు జరిగాయి. మొత్తం 34 మంది ప్రతినిధులు ఎన్నికయ్యారు.

ఆగస్టు 31న జరిగిన ఎగ్జిక్యూటివ్ బాడీ ఎన్నికల్లో 13 మంది ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులతో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా సి.హెచ్. యాదగిరి, ఉపాధ్యక్షులు-Iగా జి. మన్మధ కుమార్, ఉపాధ్యక్షులు-IIగా ఎం.డి. తకియుద్దీన్, కార్యదర్శిగా బి. శ్రీశైలం, సంయుక్త కార్యదర్శిగా సి.హెచ్. బాలస్వామి, నిర్వహణ కార్యదర్శిగా బి. అంజన్ కుమార్, కోశాధికారిగా ఆర్. విజయ్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా కె. కిరణ్ కుమార్, బి. సంతోష్ రెడ్డి, కె.ఎస్. నరేష్, సిరిపురం వేదవతి, ఎం.డి. ఇక్బాల్, చెగూరి గిరి ఎన్నికయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా ఎస్.కె. అయూబ్ ఖాన్, జి. అమాని నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్, IPS నూతన కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బంది సమస్యలను బాధ్యతగా విని, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పోలీసు శాఖ గౌరవం, క్రమశిక్షణ, వృత్తిపరమైన విలువలను కాపాడుతూ సంక్షేమం-సమన్వయం-సేవ అనే స్ఫూర్తితో కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. నూతన TGPOA జిల్లా కమిటీ పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ, వివిధ హోదాలు, విభాగాల మధ్య సమన్వయం, ఐక్యతను మరింత బలోపేతం చేసే దిశగా పని చేయనుంది.

# నాగోల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ అనూరాధ

- **రికార్డులు, కేసుల నిర్వహణపై సమీక్ష.. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలి**

**హైదరాబాద్ | సెప్టెంబర్ 1 | ఆశ్వి అప్డేట్స్:**

ఎల్‌బీనగర్ డీసీపీ శ్రీమతి బి. అనూరాధ, IPS నాగోల్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల నిర్వహణ, వివిధ విభాగాల పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమైన డీసీపీ వారి సమస్యలు, విధి నిర్వహణకు సంబంధించిన అంశాలను సమీక్షించారు. సిబ్బంది సంక్షేమంతో పాటు క్రమశిక్షణ, విధుల్లో సమర్థతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పోలీస్ సేవలు అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీసీపీ మార్గనిర్దేశం చేశారు. కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు.






# గణేష్ ఉత్సవాలపై పోలీసుల అప్రమత్తత

- **శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు.. పండుగ నిర్వాహకులతో సమావేశాలు నిర్వహించాలి**
- **అధికారులకు అదనపు సీపీ తఫ్సీర్ ఇక్బాల్ ఆదేశాలు**

**హైదరాబాద్ | ఆగస్టు 31 | ఆశ్వి అప్డేట్స్:**

రానున్న గణేష్ చతుర్థి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీగా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులకు అదనపు పోలీస్ కమిషనర్ (లా అండ్ ఆర్డర్), జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (సౌత్ రేంజ్) తఫ్సీర్ ఇక్బాల్, IPS సూచించారు.

రాజేంద్రనగర్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేసి, రానున్న గణేష్ ఉత్సవాల బందోబస్తు, శాంతిభద్రతల నిర్వహణ, పెండింగ్ దర్యాప్తు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేసి సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. పెండింగ్ ట్రయల్ (PT) కేసులను త్వరితగతిన విచారణకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా సిబ్బంది నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సాధారణ విధులతో పాటు ఉత్సవాల బందోబస్తుకు అవసరమైన సిబ్బందిని సమర్థవంతంగా కేటాయించాలని అధికారులకు సూచించారు. గణేష్ నవరాత్రుల నేపథ్యంలో స్థానిక స్థాయిలో విజిలెన్స్, సెక్యూరిటీ కమిటీలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీతో పాటు ఇతర పౌర విభాగాలతో సమన్వయం చేసుకోవాలని, నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు, కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి నిబంధనలు, భద్రతా ప్రమాణాలు, శాంతిభద్రతల పరిరక్షణకు సంబంధించిన మార్గదర్శకాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్, IPS, అదనపు డీసీపీ ఏ.ఎస్. రావు, ఏసీపీ శ్రీనివాస్, అత్తాపూర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ సీతయ్య, రాజేంద్రనగర్ పీఎస్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు పటిష్ట నిఘా చర్యలు చేపట్టాలి

- **ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్**

**కరీంనగర్, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

నేరాల నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, ఐపీఎస్ ఆదేశించారు. మంగళవారం తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఆయన వార్షిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి మొక్కలు నాటారు. జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ రిజిస్టర్లు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల ఫైళ్లు, రిసెప్షన్ నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. లాకప్ గదులు, ఆయుధాగారం, భద్రతా విభాగాలను కూడా తనిఖీ చేశారు. గ్రామాల వారీగా హిస్టరీ షీటర్లు, రౌడీ షీటర్ల కదలికలు, పెండింగ్ నాన్‌బెయిలబుల్ వారెంట్ల అమలు తీరును సమీక్షించారు. నేరాల కట్టడికి నైట్ పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ల గస్తీని మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, తద్వారా ప్రజల్లో పోలీసులపై మరింత నమ్మకం పెంపొందించాలని కమిషనర్ సూచించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, సాంకేతిక ఆధారాలతో నాణ్యమైన చార్జ్‌షీట్లు దాఖలు చేసి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లు, గ్రామాలు, కాలనీల్లో 'నేను సైతం' ప్రాజెక్టు ద్వారా సీసీ కెమెరాల ఏర్పాటు పెంచేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, రవాణాపై ఉక్కుపాదం మోపాలని, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, తిమ్మాపూర్ సీఐ బొల్లం రమేష్, ఎల్ఎండీ ఎస్ఐ అన్వర్ పాషాతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.






# ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనకు కృషి

- **సమాజంలో గౌరవంగా జీవించేలా సహకరిస్తాం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్**

**ఖమ్మం, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

ట్రాన్స్‌జెండర్లు సమాజంలో అందరితో సమానంగా గౌరవప్రదంగా జీవించేలా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పోలీస్ శాఖ తరపున అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. మంగళవారం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి సమస్యలు, జీవనోపాధి, సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించారు. స్వయం ఉపాధి ద్వారా స్వతంత్రంగా జీవించేలా అవకాశాలు కల్పించేందుకు సంబంధిత వర్గాలతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అదే సమయంలో శుభకార్యాలు, వివాహాలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాన్స్‌జెండర్లపై ఉన్న వివక్షను తొలగించి, సమాజంలో గౌరవంగా, స్వయం ఆధారితంగా జీవించేలా పోలీస్ అధికారులు జీవనోపాధి అవకాశాల కోసం కృషి చేస్తామని చెప్పడం సానుకూల పరిణామమని పలువురు ట్రాన్స్‌జెండర్లు హర్షం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కార్యాలయాన్ని ముట్టడించిన బీజేపీ

- **హైదరాబాద్ ఘటనకు నిరసనగా వనపర్తిలో ఆందోళన.. పలువురు అరెస్ట్**
- **శాంతియుత నిరసనకారుల అరెస్టు అన్యాయం: బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 1 | ఆశ్వి అప్డేట్స్:**



హైదరాబాద్‌లోని తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేశారంటూ నిరసన వ్యక్తం చేస్తూ వనపర్తి జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ముట్టడించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో కాంగ్రెస్ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాజకీయంగా ఎదుర్కోలేక భౌతిక దాడులకు పాల్పడటం కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. హైదరాబాద్ ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, శాంతిభద్రతలను కాపాడటంలో విఫలమైందని ఆరోపించారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ వ్యవస్థల వైఫల్యం కారణంగానే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించడాన్ని జిల్లా అధ్యక్షుడు నారాయణ తీవ్రంగా ఖండించారు. శాంతియుత నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, ప్రతిపక్ష పార్టీలకు కూడా భద్రత కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, కల్పన, అలివేల, నక్క మహేష్, కొమ్ము శ్రీనివాసులు, అరవింద్, గంధం ప్రవీణ్, రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# ఆరోగ్యవంతమైన చిన్నారులతోనే బలమైన భారత్ నిర్మాణం

- **పోషకాహారమే దేశ నిర్మాణానికి పునాది: డా. కె. లక్ష్మణ్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

ఆరోగ్యవంతమైన, దృఢమైన చిన్నారులతోనే బలమైన, ఆరోగ్యవంతమైన భారతదేశాన్ని నిర్మించగలమని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. పోషకాహారం ప్రతి కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉందని పేర్కొన్నారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) ఆధ్వర్యంలో పోషణ్ మాసోత్సవం-2026పై నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమ్యూనికేషన్ అండ్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ (ఐకాప్)ను మంగళవారం హైదరాబాద్ గగన్‌మహల్‌లోని ఏవీ కాలేజ్ ప్రాంగణంలో డాక్టర్ లక్ష్మణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన పరిశీలించి సీబీసీని అభినందించారు. దేశ నిర్మాణం అంటే కేవలం భవనాలు, రహదారులు నిర్మించడం కాదని, చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే అసలైన దేశ నిర్మాణమని అన్నారు. రక్తహీనత, తక్కువ బరువు, అధిక బరువు, ఊబకాయం, ఎదుగుదల లోపం వంటి సమస్యలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత పోషకాహార అవగాహన కార్యక్రమాల్లో చురుకైన భాగస్వాములుగా మారాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులతో పాటు వెనుకబడిన వర్గాల్లోనూ పోషకాహారంపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. దేశవ్యాప్తంగా సుమారు 14 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు, 9 కోట్ల మంది చిన్నారుల పరిస్థితిని డిజిటల్ విధానాల ద్వారా ప్రభుత్వం పర్యవేక్షిస్తోందని తెలిపారు. అలాగే 11 లక్షలకు పైగా పాఠశాలల్లో దాదాపు 12 కోట్ల మంది విద్యార్థులకు ప్రతిరోజూ వేడిగా వండిన భోజనం అందుతున్నట్లు వివరించారు. తెలంగాణలో వయస్సుకు తగ్గ శారీరక ఎదుగుదల లేని చిన్నారుల శాతం 33 నుంచి 27 శాతానికి తగ్గడం మంచి పరిణామమని డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి, ప్రభుత్వ సహకారంతో ఈ పురోగతి సాధ్యమైందన్నారు. చిరుధాన్యాలు, సంప్రదాయ ఆహార విధానాలను మరింతగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు. పోషకాహారంతో పాటు శారీరక దృఢత్వం కూడా ముఖ్యమని, విద్యార్థులు క్రీడలు, వ్యాయామం, యోగా వంటి వాటిని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పీఐబీ/సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ పోషకాహారం కేవలం ఆహారానికే పరిమితం కాదని, ఆరోగ్యం, ఉత్పాదకత, అభ్యాసం, జీవన నాణ్యతతో ముడిపడి ఉందన్నారు. ఒగ్గుకథ, వీధి నాటకం, కోలాటం, యక్షగానం వంటి సంప్రదాయ కళారూపాల ద్వారా పోషకాహార సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఏవీ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ రెడ్డి, ఏవీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ, పీఐబీ, సీబీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సెప్టెంబర్ 1 నుంచి 5 వరకు ఐదు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో సుమారు 40 పోషకాహార సమాచార ప్యానెళ్లతో ప్రదర్శన, నిపుణుల ప్రసంగాలు, ఐఈసీ స్టాళ్లు, వివిధ అవగాహన కార్యక్రమాలు, సంప్రదాయ జానపద కళా ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

# శ్రీకాంత్ బాబు కళకు 'కౌస్తుబం' మెరుపులు

- **సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన మధుయాష్కి గౌడ్**
- **ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్న చిత్రాలు: మధుయాష్కి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**



అరుదైన పెయింటింగ్ చిత్రాలతో వరల్డ్ రికార్డ్ సాధించిన ప్రముఖ ఆర్టిస్ట్ శ్రీకాంత్ బాబు ఆడెపు ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన 36వ సోలో ఆర్ట్ ఎగ్జిబిషన్ 'కౌస్తుబం'ను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ మంగళవారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.
ఈ సందర్భంగా గ్యాలరీలో ప్రదర్శించిన చిత్రాలను మధుయాష్కి గౌడ్ ఆసక్తిగా తిలకించారు. శ్రీకాంత్ బాబు ఆడెపు సృజనాత్మకత నుంచి రూపుదిద్దుకున్న వందలాది పెయింటింగ్ చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
ఆధ్యాత్మికత, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని అద్భుతమైన కళారూపాల్లో ఆవిష్కరించిన శ్రీకాంత్ బాబు చిత్రాలు ఎంతో ప్రత్యేకంగా ఉన్నాయని మధుయాష్కి గౌడ్ ప్రశంసించారు. కళాకారుడి ప్రతిభ, సృజనాత్మక దృష్టి ప్రతి చిత్రంలో స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. కళ ద్వారా భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక భావనలను ప్రజలకు చేరువ చేయడం అభినందనీయమని పేర్కొంటూ శ్రీకాంత్ బాబు ఆడెపును మధుయాష్కి గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో అలేఖ్య హోమ్స్ ఎండీ శ్రీనాథ్ కుర్ర, సారిక డాకూరి, అమూల్య, ఆదిభట్ల మున్సిపల్ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డ సత్యనారాయణ, ప్రచార కమిటీ కోఆర్డినేటర్ గంటా సుధీర్, సీనియర్ కాంగ్రెస్ నేత శ్రీపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యాలయంపై దాడి.. కాంగ్రెస్ అసహన రాజకీయాలకు నిదర్శనం

**నారాయణపేట, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**

హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడటాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మక్తల్ అసెంబ్లీ నేత బి.కొండయ్య తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ అసహన రాజకీయాలకు నిదర్శనమని ఆయన విమర్శించారు. ప్రజా సమస్యలపై బీజేపీ ప్రశ్నిస్తుంటే సమాధానం చెప్పాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దాడులు చేయించడం ద్వారా ప్రశ్నించే గొంతుకలను అణిచివేయాలని చూస్తోందని కొండయ్య ఆరోపించారు. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని మండిపడ్డారు. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజలకు జవాబు చెప్పే బాధ్యత ఉందని, అభివృద్ధి, సంక్షేమం, మెరుగైన పాలనతో ప్రజల ముందుకు రావాలని సూచించారు. ప్రతిపక్ష పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం ద్వారా ప్రజల ప్రశ్నలకు సమాధానం లభించదని అన్నారు. "బీజేపీని భయపెట్టాలని చూస్తే అది మీ భ్రమ మాత్రమే. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా బీజేపీ కార్యకర్తలు ప్రజా సమస్యలపై ప్రశ్నించడం ఆపరు. ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటాం" అని బి.కొండయ్య స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు బీజేపీపై దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం ప్రశ్నించడం దాని హక్కని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడం ప్రభుత్వ బాధ్యతని పేర్కొన్నారు. బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలపై వెంటనే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సిటీ పోలీసు అధికారులను బి.కొండయ్య డిమాండ్ చేశారు. దాడులు, బెదిరింపులు, రాజకీయ కక్షసాధింపులతో బీజేపీని అడ్డుకోలేరని ఆయన అన్నారు. ప్రజల కోసం ప్రశ్నించే ప్రతి గొంతుకకు బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. "కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై దృష్టి పెట్టాలి.. ప్రతిపక్షంపై దాడులపై కాదు" అని బి.కొండయ్య హెచ్చరించారు.







# ఉత్తరాఖండ్ పాత్రికేయ బృందం హైదరాబాద్ పర్యటన

- **కేంద్ర పథకాల క్షేత్రస్థాయి పరిశీలన.. హైదరాబాద్ చారిత్రక వైభవంపై అధ్యయనం**

**హైదరాబాద్, సెప్టెంబరు 1 (ఆశ్వి అప్డేట్స్):**

తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు హైదరాబాద్ నగర సుసంపన్నమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వాన్ని అనుభవించేందుకు ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన 15 మంది పాత్రికేయుల బృందం హైదరాబాద్‌లో పర్యటిస్తోంది. డెహ్రాడూన్ పీఐబీ అసిస్టెంట్ డైరెక్టర్ సంజీవ్ సుంద్రియాల్ నేతృత్వంలోని ఈ బృందం ఆగస్టు 31న హైదరాబాద్‌కు చేరుకుంది. సెప్టెంబరు 4 వరకు ఐదు రోజులపాటు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వివిధ సంస్థలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనా కేంద్రాలు, చారిత్రక ప్రదేశాలను సందర్శించనుంది. పర్యటనలో భాగంగా తొలిరోజు హైదరాబాద్‌లోని పీఐబీ కార్యాలయంలో పీఐబీ అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్‌తో పాటు ఇతర అధికారులతో పాత్రికేయ బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో మీడియా రంగం పరిణామం, కేంద్ర ప్రభుత్వ విధానాలు, ప్రధాన పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పీఐబీ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సీబీసీ) నిర్వహిస్తున్న సమాచార, ప్రచార కార్యక్రమాలను అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో పాత్రికేయుల క్షేత్రస్థాయి పర్యటనలు కీలకమని శ్రుతి పాటిల్ పేర్కొన్నారు. హైదరాబాద్ పర్యటనలో పొందిన అనుభవాలను ఉత్తరాఖండ్ ప్రజలతో పంచుకోవాలని, తెలంగాణ అభివృద్ధి, సంస్కృతి, వారసత్వంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తమ కథనాల ద్వారా కృషి చేయాలని సూచించారు. అనంతరం కేంద్ర భూవిజ్ఞాన మంత్రిత్వశాఖ పరిధిలోని *ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఇన్‌కాయిస్)*ను పాత్రికేయ బృందం సందర్శించింది. సముద్ర పరిస్థితుల పర్యవేక్షణ, సునామీ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ, సముద్ర పరిస్థితుల అంచనాలు, హెచ్చరికల జారీ తదితర అంశాల్లో భారతదేశం సాధించిన సామర్థ్యాన్ని ఇన్‌కాయిస్ అధికారులు వివరించారు. పర్యటనలో భాగంగా *ఐసీఎంఆర్ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్)*ను, కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ పరిధిలోని ఈఎస్ఐసీ ఆసుపత్రిని కూడా బృందం సందర్శించనుంది. పోషకాహార పరిశోధన, ప్రజారోగ్య చర్యలు, ఉద్యోగుల జాతీయ బీమా పథకం కింద అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించనుంది. అదేవిధంగా కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ చేనేత, చేతివృత్తులకు సంబంధించిన ప్రదర్శనను కూడా బృందం సందర్శించనుంది. సంప్రదాయ చేనేత, హస్తకళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం, కళాకారులకు లభిస్తున్న అవకాశాలపై అవగాహన పొందనుంది. హైదరాబాద్ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని తెలుసుకునేందుకు సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, లాడ్ బజార్ తదితర ప్రముఖ ప్రదేశాలను కూడా పాత్రికేయ బృందం సందర్శించనుంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిశోధనా కేంద్రాలతో పాటు హైదరాబాద్ చారిత్రక ప్రదేశాలను కలుపుకొని సాగుతున్న ఈ ఐదు రోజుల పర్యటన సెప్టెంబరు 4న ముగియనుంది.

## బీజేపీ అధ్యక్షుడి ఇంటిపై కాంగ్రెస్ దాడి పిరికిపంద చర్య

- **ప్రజాస్వామ్యంపై దాడి.. కాంగ్రెస్ అధికార అహంకారానికి నిదర్శనం: కాసోజు శంకరాచారి**

**నల్గొండ, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**



నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి నివాసంపై కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడటం పిరికిపంద చర్య అని బీజేపీ నాయకుడు కాసోజు శంకరాచారి తీవ్రంగా ఖండించారు. ఈ దాడి ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకరాచారి మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన నిరసనను సాకుగా చేసుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపైకి వెళ్లి కుటుంబ సభ్యుల పట్ల దురుసుగా ప్రవర్తించడం దారుణమన్నారు. ఇంట్లోని ఫర్నిచర్, ఫ్రిడ్జ్ తదితర వస్తువులను ధ్వంసం చేయడం మరింత బాధాకరమని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవాల్సిన చోట ఇళ్లపై దాడులకు దిగడం కాంగ్రెస్ అధికార అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. దాడికి గురైన కుటుంబాన్ని పరామర్శించేందుకు హైదరాబాద్ నుంచి నల్గొండకు బయలుదేరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డిలను పోలీసులు హౌస్ అరెస్ట్ చేసి అడ్డుకోవడాన్ని కూడా శంకరాచారి తీవ్రంగా తప్పుబట్టారు. పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని, ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణను చూసి కాంగ్రెస్ నాయకులు భయపడుతున్నారని, అందుకే ప్రతిపక్ష నేతలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడుతున్నారని శంకరాచారి ఆరోపించారు. నాగం వర్షిత్ రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేసి, బాధ్యులను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నల్గొండలో కాంగ్రెస్ గూండాయిజం, దౌర్జన్య రాజకీయాలు ఎక్కువ కాలం కొనసాగవని శంకరాచారి హెచ్చరించారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడేందుకు బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలే కాంగ్రెస్ తీరుకు తగిన సమాధానం చెబుతారని ఆయన అన్నారు.

## తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ పగ్గాలు శ్రీధర్‌కు

- **మూడు దశాబ్దాల ఫార్మసీ అనుభవంతో కొత్త బాధ్యతలు**
- **రాష్ట్రంలోని 25 వేల ఫార్మసీలకు మేలు చేకూరేలా నాయకత్వంపై ఆశలు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (ఆశ్వి అప్డేట్స్):**



తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఫార్మసీ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన శ్రీధర్ ఎన్నికయ్యారు. ఫార్మసీ రిటైల్, పరిశ్రమ రంగాల్లో సుదీర్ఘ అనుభవంతో పాటు వివిధ ఫార్మసీ సంఘాల్లో నాయకత్వ బాధ్యతలు నిర్వహించిన ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల ఫార్మసీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. 1990వ దశకంలో 'మిత్ర మెడికల్స్' ద్వారా వృత్తి ప్రస్థానాన్ని ప్రారంభించిన శ్రీధర్, అప్పటి నుంచి ఫార్మసీ రంగంలో కొనసాగుతున్నారు. ఆధునిక సదుపాయాలతో కూడిన పెద్ద ఫార్మసీ స్టోర్ల అభివృద్ధిలో ఆయన కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా 'ఫార్మా మాల్' కాన్సెప్ట్‌ను ప్రోత్సహిస్తూ ఆధునిక ఫార్మసీ రిటైల్ వ్యవస్థకు మార్గదర్శకంగా నిలిచారు. ప్రస్తుతం MediSYS Pharmacyతో అనుబంధంగా ఉన్న శ్రీధర్ ఆధ్వర్యంలో సంస్థ 8కి పైగా పెద్ద ఫార్మసీ స్టోర్లకు విస్తరించింది. మందులతో పాటు సర్జికల్ ఉత్పత్తులు, ఓవర్ ది కౌంటర్ (OTC) ఔషధాలు, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, వ్యాక్సిన్లు, ఇంజెక్షన్లు, ఇతర ఆధునిక ఆరోగ్య ఉత్పత్తులను వినియోగదారులకు అందిస్తోంది. సుమారు లక్ష రకాల ఉత్పత్తులు (SKUs) అందుబాటులో ఉంచుతూ విస్తృత ఆరోగ్య అవసరాలను తీర్చేలా సేవలు అందిస్తున్నట్లు సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

**వేలాది ఫార్మసీలకు ప్రాతినిధ్యం**

శ్రీధర్ ప్రస్తుతం హైదరాబాద్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. కెమిస్టులు, ఫార్మసీ రిటైలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, వారి ప్రయోజనాల పరిరక్షణ, వృత్తిపరమైన ప్రమాణాల మెరుగుదల కోసం ఆయన పని చేస్తున్నారు. గతంలో గ్రేటర్ హైదరాబాద్ మెడికల్ రిటైల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఈ సంస్థ సుమారు 5,500 ఫార్మసీలకు ప్రాతినిధ్యం వహిస్తుండగా, రిటైల్ ఫార్మసీ రంగంలో నాణ్యతా ప్రమాణాల పెంపు, సాధారణ సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శ్రీధర్ పనిచేశారు.

**ఆధునిక ఫార్మసీ స్టోర్లకు అవార్డు**

ఆధునిక సదుపాయాలతో కూడిన ఫార్మసీ స్టోర్ల అభివృద్ధికి చేసిన కృషికి శ్రీధర్‌కు బెస్ట్ ఫార్మసీ అవార్డు కూడా లభించింది. మూడు దశాబ్దాలకు పైగా ఫార్మసీ రంగంలో ఆయనకు ఉన్న అనుభవం, రిటైల్ రంగంలో చేసిన కృషి, వివిధ సంఘాల్లో నిర్వహించిన నాయకత్వ బాధ్యతలు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా ఆయనకు ఉపయోగపడతాయని ఫార్మసీ వర్గాలు భావిస్తున్నాయి.

**విధానాలు.. వృత్తి ప్రమాణాలపై దృష్టి**

తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడిగా శ్రీధర్ నాయకత్వంలో ఫార్మసీ వృత్తికి సంబంధించిన విధానాలు, వృత్తిపరమైన ప్రమాణాలు, ఫార్మసీ ప్రాక్టీస్, ఫార్మసిస్టుల ప్రయోజనాలపై మరింత దృష్టి సారించే అవకాశం ఉందని ఫార్మసీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 వేల ఫార్మసీలు ఉన్న నేపథ్యంలో ఫార్మసీ రంగంలోని క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన ఉన్న శ్రీధర్ నాయకత్వం ఫార్మసీలు, ఫార్మసిస్టులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన ఫార్మసీ సేవలు అందేలా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ఫార్మసీ వృత్తి అభివృద్ధికి ఆయన అనుభవం దోహదపడుతుందని పరిశ్రమ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## నాగర్‌కర్నూల్‌లోనే తల్పునూర్‌ను కలపాలి!

- **78వ రోజుకు చేరిన తల్పునూర్ గ్రామస్థుల రిలే నిరాహార దీక్షలు**

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 1 | ఆశ్వి అప్డేట్స్:**

పరిపాలనా సౌలభ్యం కోసం తల్పునూర్ గ్రామాన్ని వనపర్తి జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష జేఏసీ ఆధ్వర్యంలో గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 78వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. తల్పునూర్ నుంచి నాగర్‌కర్నూల్ కేవలం 14 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో విద్య, వైద్యం, వ్యవసాయం, ఇతర నిత్యావసరాల కోసం నాగర్‌కర్నూల్‌పైనే ఆధారపడుతున్నామని తెలిపారు. మరోవైపు వనపర్తి జిల్లా కేంద్రం సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు సరైన రవాణా సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోనే ఉన్న తల్పునూర్‌ను తిరిగి అదే జిల్లాలో విలీనం చేయడం ద్వారా ప్రజలకు పరిపాలనా సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. "దూరం తగ్గాలి.. ఇబ్బందులు తొలగాలి.. తల్పునూర్‌ను నాగర్‌కర్నూల్‌లోనే కలపాలి" అంటూ గ్రామస్థులు నినదించారు. తమ డిమాండ్ పరిష్కారమయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్షల్లో అఖిలపక్ష జేఏసీ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తగూడెం విమానాశ్రయంపై కీలక ముందడుగు

- 7న రానున్న కేంద్ర సాంకేతిక బృందం

**న్యూదిల్లీ, ఆశ్వి అప్డేట్స్:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైన 4 నుంచి 5 ప్రత్యామ్నాయ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు కేంద్ర సాంకేతిక బృందం ఈనెల 7న పర్యటించనుంది. దిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో మంగళవారం భేటీ అయిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ వివరాలను వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో అనుకూలంగా లేకపోవడంతో కొత్తగా మరికొన్ని స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లో భౌగోళిక, వాతావరణ పరిస్థితులు, విమానాశ్రయ నిర్మాణ సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం పరిశీలించనుంది. సాంకేతిక నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. భద్రాచలం రామాలయ విశిష్టతను, జిల్లా ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షను పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించిన కేంద్ర మంత్రికి తుమ్మల ధన్యవాదాలు తెలిపారు. అలాగే, వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



## కాలువల సామర్థ్యం పెంచి 7,500 ఎకరాలకు సాగునీరు

- దేవరకద్రలో సాగునీటి వనరుల సద్వినియోగానికి చర్యలు: ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | సెప్టెంబర్ 01 | ఆశ్వి అప్డేట్స్**

దేవరకద్ర నియోజకవర్గంలో సాగునీటి వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా కాలువల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మంగనూర్ వద్ద కేఎల్ఐ మెయిన్ కెనాల్ నుంచి వెళ్లే డిస్ట్రిబ్యూటరీ D8, D12, D13 కాలువలను అధికారులు, రైతులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అడ్డాకుల, మూసాపేట్, భూత్పూర్ మండలాల్లోని గొలుసుకట్టు చెరువులను నీటితో నింపేందుకు కొత్త కాలువల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల సామర్థ్యాన్ని పెంచి మొత్తం 7,500 ఎకరాలకు సాగునీరు అందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. చెరువులు పూర్తిస్థాయిలో నిండితే భూగర్భ జలమట్టాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. సాగునీటి వసతులను మెరుగుపరిచి రైతులకు స్థిరమైన నీటి లభ్యత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు.



# భారత్‌కు మరిన్ని ఎస్-400 క్షిపణులు

- రష్యాతో ఒప్పందం కుదుర్చుకోనున్న ఇండియా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :**

ఆపరేషన్ సిందూర్‌లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలను భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని రక్షణ శాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్`400 వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు జారీ చేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈమేరకు ఐదు కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో విజయవంతంగా పనిచేసింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. వీటి పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాక్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ దూరంలో ఎస్400 కూల్చివేసినట్లు పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్400 అనేది ఒకే మిసైల్ కాదు.. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం భారత్ మొత్తం ఐదు ఎస్400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు నాలుగు యూనిట్లు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో ఐదు యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

# స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

**న్యూదిల్లీ, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**



భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్` జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు తెలిపారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని, అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని సూచించారు.. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచించారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వేదికగా వీడియో విడుదల చేశారు. 'దేశ ప్రజలకు అభినందనలు.. 7.8 శాతం వృద్ధి గొప్ప విషయం.. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం.. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది.. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది.. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే.. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది.. 2020లో కొవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు.. అయినా భారత్ పురోగమిస్తోంద'ని ఆ వీడియోలో పేర్కొన్నారు. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉంది' అని మోదీ పేర్కొన్నారు.

# ఆగస్టులో జీఎస్టీ వసూళ్ల జోరు

- గతేడాదితో పోల్చితే 14.8 శాతం అధికం
- తాత్కాలిక గణాంకాలు విడుదల

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్ :**

దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా వృద్ధి చెందుతున్నదనడానికి సంకేతంగా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు మరోసారి ఆశాజనకంగా నమోదయ్యాయి. ఆగస్టు నెలకు జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి రూ.1,99,853 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. గతేడాది ఇదే నెలతో పోలిస్తే ఇది 14.8 శాతం అధికం. ముఖ్యంగా దిగుమతుల పై పన్నుల వసూళ్లు గణనీయంగా పెరగడమే ఈ వృద్ధికి ప్రధాన కారణంగా నిలిచింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తాత్కాలిక గణాంకాలను మంగళవారం విడుదల చేసింది. గత ఏడాది ఆగస్టులో జీఎస్టీ వసూళ్లు రూ.1,74,116 కోట్లుగా ఉండగా ఈసారి దాదాపు రూ.2 లక్షల కోట్ల మార్కుకు చేరువయ్యాయి. ఈ ఏడాది జులైలో నమోదైన రూ.2.11 లక్షల కోట్లతో పోలిస్తే ఆగస్టు వసూళ్లు కొంత తక్కువగా ఉన్నాయి. ఈ వృద్ధిలో దిగుమతుల నుంచి వచ్చిన జీఎస్టీ కీలక పాత్ర పోషించింది. దిగుమతులపై స్థూల జీఎస్టీ ఆదాయం ఏకంగా 29 శాతం పెరిగి రూ.62,604 కోట్లకు చేరింది. మరోవైపు, దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన జీఎస్టీ కూడా 9.3 శాతం వృద్ధితో రూ.1,37,249 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఆగస్టులో ప్రభుత్వం చెల్లించిన రిఫండ్‌లు కూడా భారీగా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే రిఫండ్‌లు 67.9 శాతం పెరిగి రూ.31,795 కోట్లకు చేరాయి. దీంతో రిఫండ్‌లను మినహాయించిన తర్వాత ప్రభుత్వానికి అందిన నికర జీఎస్టీ ఆదాయం రూ.1,68,057 కోట్లుగా ఉంది. ఇది గతేడాది నికర ఆదాయంతో పోలిస్తే 8.3 శాతం మాత్రమే ఎక్కువ. నికర వసూళ్లను విశ్లేషిస్తే కస్టమ్స్ జీఎస్టీ ఆదాయం 22.3 శాతం వృద్ధితో రూ.49,299 కోట్లకు చేరగా, దేశీయ నికర జీఎస్టీ వసూళ్ల వృద్ధి మాత్రం కేవలం 3.4 శాతానికే పరిమితమై రూ.1,18,759 కోట్లుగా నమోదైంది. దేశీయంగా రిఫండ్‌లు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఈ గణాంకాలు వెలువడిన నేపథ్యంలో ఈనెల 12న దిల్లీలో 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరగనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశానికి ఒకరోజు ముందు అధికారుల స్థాయి సమావేశం కూడా జరగనున్నట్లు జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది.

# నీట్ పేపర్ లీకేజీ ఆందోళనకారులపై ఎఫ్ఐఆర్ ఎత్తివేత

- సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**



నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఢిల్లీతో పాటు దేశ వ్యాప్తంగా జరిగిన ఆందోళనలో పాల్గొన్నవారిపై నమోదైన ఎఫ్ఐఆర్ లను సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆందోళనల్లో పాల్గొన్న యువత, విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు మంగళవారం నిర్ణయం తీసుకుంది, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ ఈ తీర్పు వెల్లడించింది. దిల్లీ, అసోం, పశ్చిమ బెంగాల్, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కోర్టు కొట్టివేసింది. దిల్లీ పరిధిలో జంతర్ మంతర్ వద్ద జూలై 2025 వరకు జరిగిన నిరసనలపై 13 ఎఫ్ఐఆర్ లు నమోదయ్యాయి. అయితే ఈ ఆందోళనల్లో పాల్గొన్న వారిపై ఎలాంటి కేసులు ఉండవు. కానీ, గతంలో క్రిమినల్ కేసులు ఉన్నవారిపై మాత్రం ఎఫ్ఐఆర్‌లు కొనసాగుతాయి. అలా 2,873 మందిపై నమోదైన ఎఫ్ ఐఆర్ లు మాత్రం కొనసాగుతాయని కోర్టు తెలిపింది. నీట్ ఆందోళనలపై అన్ని రాష్ట్రాల్లో నమోదైన కేసులు కొట్టివేయాలని ప్రభుత్వాలను ఆదేశించింది. మరోవైపు నీట్ పేపర్ లీకేజీ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే విషయంపై కూడా సుప్రీంకోర్టు స్పందించింది. పరిహారం అందించేందుకు మూడు నెలల్లో విధివిధానాలు రూపొందిస్తామని ప్రభుత్వం తెలిపినట్టు కోర్టు పేర్కొంది.

# ఉగ్రవాదం వ్యూహాత్మక ఆస్తి కాదు

- పాక్ ప్రధాని సమక్షంలో మోదీ కీలక వ్యాఖ్యలు
- ఉగ్రవాదానికి ఆశ్రయం, మద్దతుపై గట్టి సందేశం
- ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని పిలుపు
- ద్వంద్వ ప్రమాణాలకు చోటు లేదని స్పష్టీకరణ
- సార్వభౌమత్వాన్ని గౌరవించేలా మౌలిక వసతుల ప్రాజెక్టులు

**బిష్కెక్, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**

కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో ప్రధాని మోదీ ఉగ్రవాదంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని ప్రభుత్వ విధానంగా ఉపయోగించే దేశాలు, ఉగ్రవాదులకు ఆశ్రయం, మద్దతు ఇచ్చే దేశాలకు అంతర్జాతీయ సమాజం గట్టి సందేశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ''ఉగ్రవాదం ఎప్పటికీ వ్యూహాత్మక ఆస్తి కాదు'' అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలోనే మోదీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ద్వంద్వ ప్రమాణాలకు తావులేదు**

ఎస్‌సీఓ దేశాధినేతలను ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని తమ విధానాలను అమలు చేసేందుకు సాధనంగా ఉపయోగించే దేశాలను ఉపేక్షించకూడదన్నారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం, మద్దతు ఇవ్వడం వంటి చర్యలకు పాల్పడే దేశాలపై అంతర్జాతీయ సమాజం గట్టి హెచ్చరిక చేయాలని అన్నారు. ఉగ్రవాదంపై ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్ని దేశాలు ఒకే గొంతుతో స్పష్టం చేయాలని పిలుపునిచ్చారు.

**ఉగ్రవాద వ్యవస్థను నిర్మూలించాలి**

ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ప్రధాని అన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఉగ్రవాదుల నియామకం, తీవ్రవాద భావజాలం వైపు మళ్లించడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అంశాలపై దేశాలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. 2025లో ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్ పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్య చేపట్టిన విషయం తెలిసిందే.

**సార్వభౌమత్వానికి గౌరవం**

మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల్లో దేశాల మధ్య సహకారం అవసరమని మోదీ అన్నారు. అయితే అలాంటి ప్రాజెక్టులు ఇతర దేశాల సార్వభౌమ భూభాగాన్ని గౌరవించేలా ఉండాలని స్పష్టం చేశారు.



**అగ్రనేతల హాజరు**

బిష్కెక్‌లో జరిగిన సమావేశానికి మోదీ, షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో, కజకిస్థాన్ అధ్యక్షుడు కాసిమ్‌జోమార్ట్ టోకయేవ్, ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్, తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రహ్మాన్ తదితరులు హాజరయ్యారు.

**2001లో ఏర్పడిన ఎస్‌సీఓ**

పరస్పర విశ్వాసం, స్నేహం, పొరుగు దేశాలతో సత్సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు వివిధ రంగాల్లో పరస్పర ప్రయోజనకర సహకారాన్ని ప్రోత్సహించడం ఎస్‌సీఓ ప్రధాన లక్ష్యాలు. 2001లో చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గిజిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌లతో ఈ సంస్థ ఏర్పడింది. 2017లో భారత్, పాకిస్థాన్ పూర్తిస్థాయి సభ్యదేశాలుగా చేరాయి. 2023లో ఇరాన్, 2024లో బెలారస్ సభ్యదేశాలుగా చేరాయి.

## సెప్టెంబర్ 5 నిరసన రద్దు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 1, ఆశ్వి అప్డేట్స్:**

కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5న ఢిల్లీలో నిర్వహించ తలపెట్టిన నిరసన మార్చ్‌ను రద్దు చేసింది. ఢిల్లీతో పాటు బీజేపీ పాలిత నాలుగు రాష్ట్రాల్లో నీట్ ఆందోళనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, ఇకపై కొత్త కేసులు నమోదు చేయబోమని కేంద్రం సుప్రీంకోర్టుకు హామీ ఇవ్వడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీజేపీ ప్రకటించింది. ఈ విషయాన్ని పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. ఢిల్లీ పోలీసులు, బీజేపీ పాలిత రాష్ట్రాల వైఖరిని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 5 నిరసన పిలుపును ఉపసంహరించుకుంటున్నట్లు వెల్లడించారు.

**కేంద్రం కీలక హామీలు**

ఢిల్లీ, బిహార్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, అసోం పోలీసుల తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు పలు హామీలు ఇచ్చారు. ఇప్పటికే నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొనసాగించబోమని, వాటిలో ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోమని తెలిపారు. నిరసనలకు సంబంధించి ఇకపై కొత్తగా ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని స్పష్టం చేశారు. నిరసనకారులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, అనంతరం పలు అంశాలపై అవగాహన కుదిరిందని చెప్పారు.

**ఆర్టికల్ 142తో ఎఫ్ఐఆర్‌ల రద్దు**

ఈ నేపథ్యంలో సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ పోలీసులు ఆందోళనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను రాజ్యాంగంలోని ఆర్టికల్ 142ను ఉపయోగించి కొట్టివేయాలని సొలిసిటర్ జనరల్ కోర్టును కోరారు. పూర్తి న్యాయం చేసేందుకు ఆర్టికల్ 142ను వినియోగిస్తూ నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే నేర చరిత్ర ఉన్న వ్యక్తులపై నమోదైన కేసులు కొనసాగుతాయని పేర్కొంది.

**సెప్టెంబర్ 5 నిరసనకు పిలుపు**

జూలై 25న కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ సీజేపీ సెప్టెంబర్ 5న న్యూఢిల్లీలో దేశవ్యాప్త నిరసన మార్చ్‌కు పిలుపునిచ్చింది. జూలై 25 తర్వాత దేశవ్యాప్తంగా చేపట్టిన నిరసనలను ఉపసంహరించుకున్నప్పటికీ, కేంద్రం హామీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ మరోసారి ఆందోళనకు సిద్ధమైంది. సీజేపీ జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం ఏకగ్రీవంగా తీసుకున్నారు. తాజాగా కేంద్రం సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీల నేపథ్యంలో నిరసనను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**మృతుల కుటుంబాలకు పరిహారం**

నీట్ పేపర్ లీక్ తర్వాత ఆత్మహత్యలకు పాల్పడి మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అందించే హామీకి కేంద్రం కట్టుబడి ఉందని తుషార్ మెహతా సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే పరిహారం చెల్లింపునకు సంబంధించిన విధివిధానాలను ఇంకా ఖరారు చేయాల్సి ఉందన్నారు. పలు రాష్ట్రాల్లో పేపర్ లీక్ ఘటనలు చోటుచేసుకున్నందున పరిహారం సాధారణ నిబంధనగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని వివరించారు.

**మూడు నెలల్లో విధివిధానాలు**

రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వాములతో చర్చించి పరిహార పథకాన్ని ఖరారు చేసేందుకు మూడు నెలల సమయం అవసరమని కేంద్రం కోర్టుకు తెలిపింది. విధివిధానాలు ఖరారైన వెంటనే పథకాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. విద్యార్థుల ఆత్మహత్యల కేసుల్లో వారి కుటుంబాలకు పరిహారం అందించే విధివిధానాలను మూడు నెలల్లో ఖరారు చేసి, అనంతరం చెల్లింపులు చేపట్టాలని సీజేఐ సూర్యకాంత్ సూచించారు.

# మీరు హెల్దీగానే ఉన్నారా? ఇలా తెలుసుకోండి?





మనం అన్ని విధాలా ఆరోగ్యంగానే ఉన్నామా? లేదా? ఏదైనా సమస్య ఉందా? అన్న విషయం మనం కొన్ని అంశాల ఆధారంగా తెలుసుకోవచ్చు. మనకు తీవ్ర అనారోగ్యం కలిగినప్పుడు మాత్రమే కొన్ని రకాల పరీక్షలు చేయించుకుంటూ ఉంటాం. అప్పుడే మనకు ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా? అన్న విషయం తెలుస్తూ ఉంటుంది. అయితే మన శరీరంలో జరిగే కొన్ని మార్పుల ఆధారంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం తెలుసుకోవచ్చు. అవేంటో ఈ కథనంలో తెలుసుకుందాం..

## జీర్ణవ్యవస్థ


మన ఆరోగ్యం విషయంలో జీర్ణ వ్యవస్థ ఎంతో కీలకం. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాలేదంటే మనకు ఏదో జీర్ణ సంబంధిత వ్యాధి ఉన్నట్టు పరిగణించాలి. తిన్న తర్వాత గ్యాస్ పట్టినట్టు అనిపిస్తుంటే కచ్చితంగా జీర్ణ వ్యవస్థలో ఏదో ఇబ్బంది ఉన్నట్టే గుర్తించాలి. మనం తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం అయితేనే మన శరీరానికి అన్ని రకాల పోషకాలు అందుతాయి.



## తగినంత నిద్ర

మనకు సరిగ్గా నిద్ర పట్టడం లేదంటే.. మనం డేంజర్ లో ఉన్నట్టే.. కాబట్టి కచ్చితంగా ప్రతి రోజు ఎనిమిది గంటల పాటు నిద్ర పోవాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతోపాటూ నిద్ర రాకపోయినా సమస్యగానే పరిగణించాలి. ఆరోగ్యంగా ఉన్నవారు మంచి నిద్రను పొందుతారు. రాత్రి నిద్ర తర్వాత రిఫ్రెష్, విశ్రాంతిని పొందుతారని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. శరీరానికి మంచి నాణ్యమైన నిద్ర లభిస్తే.. అది మంచి శారీరక, మానసిక ఆరోగ్యానికి సంకేతంగా పరిగణించబడుతుంది.





## సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు

మూత్రవిసర్జన వలె, ప్రేగు కదలికలపై కూడా శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. సాధారణ, సౌకర్యవంతమైన ప్రేగు కదలికలు మెరుగైన జీర్ణక్రియకు సంకేతంగా పరిగణించబడతాయి. రోజుకు ఒకటి లేదా రెండుసార్లు ప్రేగు కదలికలను కలిగి ఉండటం సాధారణమైనదిగా పరిగణించబడుతుంది. మలం విసర్జించడంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా, మలవిసర్జన తర్వాత ఖాళీగా అనిపిస్తే అది మంచి ఆరోగ్యానికి సంకేతం.

## మూత్రం రంగు

మనం ఆరోగ్యంగా ఉన్నామా? లేదా? అన్న విషయం మన మల, మూత్రాల రంగును చూస్తే అర్థమవుతుంది. ఉన్నామో లేదో తెలుసుకోవడానికి.. మలం, మూత్రంపై శ్రద్ధ చూపడం చాలా ముఖ్యం. లేత పసుపు మూత్రం సాధారణంగా మీరు బాగా హైడ్రేట్ గా ఉన్నారని సూచిస్తుంది. ఇది కిడ్నీ రికవరీకి సంకేతంగా కూడా పరిగణించబడుతుంది. మూత్రం గట్టిపడటం లేదా రంగులో మార్పు కనిపిస్తే, జాగ్రత్తగా ఉండాలి.



## బరువును నియంత్రించడం:

అనేక రకాల వ్యాధులను నివారించడానికి బరువును అదుపులో ఉంచుకోవడం చాలా అవసరం. మీ శరీర ఎత్తును బట్టి మీ బరువు సరిగ్గా ఉంటే అది మంచి ఆరోగ్యానికి సంకేతం. మీ బరువు తక్కువ సమయంలో వేగంగా పెరుగుతూ లేదా తగ్గుతూ ఉంటే, జాగ్రత్తగా ఉండాలి. బరువు అసమతుల్యత అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతుంది.





## మంచి మానసిక ఆరోగ్యం:

శారీరక ఆరోగ్యంలాగే, మానసిక ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. మీరు తక్కువ ఒత్తిడికి లోనవుతుంటే, మీ మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. చిరాకు, భయం వంటి సమస్యలు ఉండవు. అది మంచి మానసిక ఆరోగ్యానికి సంకేతం. శారీరక మరియు మానసిక ఆరోగ్యం ఒకదానికొకటి సంపూర్ణంగా ఉంటాయని ఇక్కడ గమనించడం ముఖ్యం. వీటిలో ఏదైనా ఒకదానిలో ఆటంకం మొత్తం శరీరంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.



## గాయాలను త్వరగా నయం చేయడం

శరీరంపై గాయం లేదా గాయం ఎంత త్వరగా నయం అవుతుందనే దాని ఆధారంగా కూడా ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. గాయాలు త్వరగా మానితే మన రోగనిరోధక వ్యవస్థ బాగానే ఉందనడానికి సంకేతం. మధుమేహం వంటి వ్యాధులలో రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల గాయాలు మానడానికి చాలా సమయం పడుతుంది. వీటితో పాటు మనం తరుచూ అనారోగ్యానికి గురవుతున్నామంటే కచ్చితంగా డాక్టర్ ను సంప్రదించి అన్ని పరీక్షలు చేయించుకోవాలి.

# ఉలవలతో ఇన్ని లాభాలా?




ఉలవచారు, ఉలవచారు బిర్యాని ఇప్పుడు ఎంతో ఫేమస్. అయితే ఉలవలతో అనేక ఆరోగ్యప్రయోజనాలు ఉన్నాయి. అందుకే వీటితో ఇప్పుడు రకరకాల వంటలు చేస్తున్నారు. భారత దేశంలోని ఉష్ణమండల వాతావరణాల్లో ఈ ఉలవలు పెరుగుతాయి. వీటిలో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు ఉలవలను తమ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎర్రటి, గోధుమ రంగు పప్పధాన్యాలు అవసరమైన పోషకాలతో నిండి ఉంటాయి. వీటిని శతాబ్దాలుగా సాంప్రదాయ వైద్యంలో వివిధ రకాల రోగాలకు చికిత్స చేయడానికి ఉపయోగించబడుతున్నాయి.

## ప్రోటీన్ పుష్కలంగా..

ఉలవల్లో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. కండరాల పెరుగుదలకు, మరమ్మతుగా ప్రోటీన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. శాకాహారులకు ప్రోటీన్ అందజేసే ఆహారాల్లో ఉలవలు కూడా ఎంతో కీలకం. ఇక ఉలవల్లో ఫైబర్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇంకా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్ ను నిర్వహించడంలో ఫైబర్ కూడా కీలక పాత్ర పోషిస్తుంది. పోషకాలు అధికంగా ఉండే ఉలవల్లో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది బరువు నిర్వహణ, మొత్తం ఆరోగ్యానికి గొప్ప ఆహారంగా మారుతుంది. ఉలవల్లో యాంటీ డయాబెటిక్ లక్షణాలు ఉన్ఆనయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తాయని అధ్యయనాలు నిరూపించాయి.

## గుండె ఆరోగ్యం పదిలం

ఉలవలు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. దాని అధిక ఫైబర్ కంటెంట్, యాంటీఆక్సిడెంట్ లక్షణాల కారణంగా గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉలువలలో ఉండే ఐరన్, మెగ్నీషియం, విటమిన్ సీ వంటి విటమిన్లు, ఖనిజాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి.





# కాకరతో ఇన్ని ప్రయోజనాలా? తెలిస్తే అస్సలు వదలరు..!

కాకరకాయ ఈ కూరగాయ పేరు చెప్పగానే చాలా మంది నిట్టూరుస్తారు. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే కాకరను తప్పదన్నట్టు తింటుంటారు. అయితే కాకరకాయతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆహారరంగ నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా షుగర్ వ్యాధి గ్రస్తులకు కాకరకాయ ఓ సంజీవని లాంటిది. చక్కెర స్థాయిలను కాకర కంట్రోల్ చేస్తోంది. బరువు తగ్గడంలోనూ తోడ్పడుతుంది. జీర్ణ వ్యవస్థను కూడా మెరుగుపరుస్తుంది.

## కాకరరసంతో లాభాలు ఇవే..!

కాకరకాయ జ్యూస్ తరుచూ తీసుకోవడం వల్ల జీర్ణ సంబంధిత వ్యాధులకు దూరం కావొచ్చట. జీర్ణ వ్యవస్థను మెరుగుపరచడంలో కాకర కాయ రసం ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రస్తుత కాలంలో ప్రతి నలుగురిలో ఒకరు జీర్ణ సంబంధిత సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. ముఖ్యంగా కాకర కాయ రసాన్ని ఖాళీ కడుపుతో తాడగం వల్ల శరీరంలోని సమస్యలు తొలగిపోయి జీర్ణ సంబంధిత సమస్యలు తగ్గుతాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

## బరువు నియంత్రణ:

పెరిగిన బరువుతో చాలా మంది ఆందోళన చెందుతున్నాయి. అలాంటి వారు కాకర కాయ రసం తాగితే చాలా ప్రయోజనాలు ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండే కాకర కాయ రసం బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా కాకర రసం తాగడం వల్ల ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఇది బరువు తగ్గడానికి ఎంతో సహాయపడుతుంది.

## ఇమ్యూనిటీ బూస్టర్.. !

ప్రస్తుత వర్షా కాలంలో జనం అనేక రోగాల బారిన పడుతున్నారు. సరైన ఇమ్యూనిటీ లేకపోవడం వల్లే వ్యాధుల బారిన పడుతున్నారు. అయితే కాకర రసం తరుచూ తీసుకోవడం.. లేదంటే కాకరకాయలను కూర చేసుకొని తినడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కాకరకాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తినిపెంచుతాయి.

## చర్మానికి మేలు:

కాకర కాయ రసం చర్మానికి ఎంతో మేలు చేస్తుంది. కాకర కాయలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి . ఇవి చర్మాన్ని ఫ్రీ రాడికల్స్ నుంచి రక్షించి కాంతివంతగా చేస్తాయి. కాకర కాయ రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల చర్మానికి కొత్త మెరుపు వస్తుంది. అంతే కాకుండా దీని వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

## వెంకీ కోసం రీమిక్స్ గీతం?

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం: 47'ని ముగించే పనిలో ఉన్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. శ్రీనిధి శెట్టి కథానాయిక. ప్రస్తుతం తుది దశ చిత్రీకరణలో ఉన్న ఈ చిత్రం అక్టోబరు 2న థియేటర్లలోకి రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇప్పుడీ సినిమాకి సంబంధించి నెట్టింట ఆసక్తిర చర్చ మొదలైంది. వింటేజ్ వెంకటేశ జ్ఞాపకాల్ని గుర్తు చేసేలా.. ఆయన హిట్ సినిమా 'కూలీ నెం.1'లోని "దండాలయ్యా ఉండ్రాలయ్యా" పాటని తమన్ దీంట్లో రీమిక్స్ చేస్తున్నారని తెలిసింది. త్వరలోనే దీనిపై చిత్ర వర్గాల నుంచి స్పష్టత వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది. క్రైమ్ అంశాలతో ముడిపడిన ఈ యాక్షన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో చిట్టిబాబు పాత్రలో వెంకీ అలరించనున్నారు. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. రవి కె.చంద్రన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



## నటనను అదృష్టంగా భావిస్తా!

ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ తనేంటో నిరూపించుకుంది అందాల తార రాశీఖన్నా. ప్రేమకథలు, యాక్షన్ ఎంటర్‌టైనర్‌లతో ఇటు దక్షిణాదితో పాటు.. బాలీవుడ్‌లోనూ మంచి క్రేజ్ సంపాదించుకుందీ భామ. 2013లో 'మద్రాస్ కేఫ్'తో నాయికగా సినీప్రయాణం మొదలెట్టిన ఈమె.. ఈ మధ్యే చిత్రపరిశ్రమలోకి వచ్చి 13ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే రాశి తన కెరీర్‌ను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేసింది. "13ఏళ్లు అనేది సుదీర్ఘ సమయం. కానీ నటనను ఎప్పుడూ ఒక అదృష్టంగానే భావించాను. అందుకే సమయం తెలియకుండానే వేగంగా గడిచిపోయింది. 'మద్రాస్ కేఫ్' రోజుల్ని గుర్తుచేసుకుంటే నా ప్రయాణం ఎందుకు మొదలైందో తెలుస్తుంది. నాకు ముఖ్యమైన కథలను చెప్పే అవకాశాన్ని అది నాకు ఇచ్చింది. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలను పోగుచేసుకున్నా. నన్ను ఆదరించి నాకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు" అని చెప్పుకొచ్చింది రాశి. ప్రస్తుతం ఆమె 'ఫర్జీ 2', 'ధర్మన్' లాంటి సినిమాల షూటింగ్‌లతో బిజీగా గడుపుతోంది.




## నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది..

టాలీవుడ్ అగ్ర కథానాయకుడు మహేశ్ బాబు (Mahesh Babu) తన కుమారుడు గౌతమ్ ఘట్టమనేనికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ్ నేడు 20వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. వారిద్దరి ఫొటోను పంచుకుంటూ 'ప్రతిరోజూ నిన్ను చూసి గర్వపడుతున్నా' అంటూ రాసుకొచ్చారు. "హ్యాపీ 20 గౌతమ్.. నీ జీవితంలో సరికొత్త అధ్యాయం మొదలైంది. నీ కలలను ఎప్పుడూ ధైర్యంగా సాకారం చేసుకోవాలి. నేను ప్రతిరోజూ నిన్ను చూసి గర్వపడుతున్నా" అని మహేశ్ బాబు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. మహేశ్ అభిమానులు కూడా గౌతమ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

ఇది చెప్పడం సంతోషంగా ఉంది: కావ్య కల్యాణ్‌రామ్‌తో కాల భైరవ రిలేషన్‌షిప్

నమ్రతా శిరోద్కర్ కూడా గౌతమ్‌కు శుభాకాంక్షలు చెబుతూ పోస్టు పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు గౌతమ్.. నువ్వు నీ కలలు, లక్ష్యాలన్నింటినీ సాధించాలని కోరుకుంటున్నా. ఎప్పటికీ నిన్ను ప్రేమిస్తూనే ఉంటా' అని ఆమె ఇన్‌స్టా వేదికగా రాసుకొచ్చారు.



## శ్రీవిష్ణు కొత్త సినిమా నుంచి గ్లింప్స్ రిలీజ్..
## యూత్ టార్గెట్‌గా 'ఇది మనందరి కథ'



శ్రీవిష్ణు హీరోగా, ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్మెంట్స్ కలయికలో ఓ ప్రాజెక్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 'ప్రొడక్షన్ నెం.39'గా రాబోతున్న ఈ సినిమాను ఓటీటీ చిత్రం 'అనగనగా' ఫేమ్ డైరెక్టర్ సన్నీ సంజయ్ తెరకెక్కిస్తున్నాడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. "ది స్టోరీ ఆఫ్ ఎవ్రీ యంగ్‌స్టర్" అనే ఆసక్తికరమైన ట్యాగ్ లైన్‌తో రాబోతున్న ఈ మూవీ నుంచి తాజాగా 'ఇది మనందరి కథ' అంటూ ఒక చిన్న గ్లింప్స్‌ను రిలీజ్ చేశారు. 'చిన్నప్పుడు మనం చాలా కలలు కంటాం. అది అయిపోవాలి, ఇది అయిపోవాలి అని.. ఆ తర్వాత మన తండ్రి స్తోమత వరకు ఒక మామూలు కాలేజీలో చదువుకుంటాం.. పెద్దయ్యాక మన కుటుంబ బాధ్యతలు మీద పడటం వల్ల ఒక ఉద్యోగం చెయ్యడం మొదలు పెడతాం.. అది నచ్చిన నచ్చకపోయిన చేస్తూనే ఉంటాం. కానీ ఈ ప్రయాణంలో మనం ఏం అవ్వాలి అనుకున్నది మర్చిపోతాం.. జీవితం ఇచ్చే జీతాలను తీసుకుంటాం.. మనందరి కథ.. అందరిలాగే నా కథ' అంటూ వచ్చిన ఈ గ్లింప్స్ ప్రజెంట్ యూత్‌ను ఆకర్షిస్తుంది.

## కి అండ్ కా సీక్వెల్‌లో కియారా?

'టాక్సిక్'తో నదియాగా ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ నాయిక కియారా అడ్వాణీ. ఓ వైపు ఈ సినిమాతో థియేటర్లలో సందడి చేస్తూనే.. తన రాబోయే ప్రాజెక్ట్ కోసం సన్నాహాలు మొదలు పెట్టిందామె. ఒక అసాధారణమైన వివాహ బంధం చుట్టూ తిరిగే కథనంతో రూపొందిన చిత్రం 'కి అండ్ కా'. కరీనా కపూర్, అర్జున్ కపూర్ జంటగా నటించిన ఈ సినిమా 2016లో విడుదలై ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు దీనికి సీక్వెల్ రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇందులో నాయికగా కియారాను ఎంపిక చేసిందట చిత్రబృందం. "ప్రస్తుతం 'కి అండ్ కా 2'కు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మొదటి భాగానికి మించి వినోదాన్ని పంచేలా ఈ కొనసాగింపును తీర్చిదిద్దనున్నారు. మరోవైపు కథానాయకుడి పాత్ర కోసం పలువురు హీరోలను పరిశీలిస్తుంది చిత్రబృందం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాల్ని అధికారికంగా ప్రకటించడానికి సన్నాహాలు చేస్తున్నార"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.



## తెలుగు ప్రేక్షకుల ప్రేమే నా బలం



కథానాయకుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఫాంటసీ థ్రిల్లర్ 'ఐ యామ్ గేమ్'. ఆంటోనీ వర్గీస్, మిస్కిన్, నటి కయాదు లోహర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబరు 3న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో నిర్వహించిన ప్రమోషనల్ ఈవెంట్‌లో విద్యార్థులతో చిత్రబృందం ముచ్చటించింది. ఈ సందర్భంగా దుల్కర్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. "స్కూల్ రోజుల్లో నాకు హిందీ, తమిళం, మలయాళం తప్ప తెలుగు ఏమాత్రం రాదు. 'ఓకే బంగారం' సినిమా తర్వాత తెలుగులో నాకు చాలా అవకాశాలు వచ్చాయి. భాష రాదు కాబట్టి నేను ఆ సినిమాలు చేయలేనని చెప్పేశాను. కానీ 'మహానటి' ఆఫర్ వచ్చినప్పుడు దర్శకుడు నాగ్ అశ్విన్ 'నేను నేర్పిస్తానని' చెప్పారు. అప్పుడు డైలాగ్స్ నేర్చుకునేందుకు రాత్రంతా నిద్రపోకుండా ప్రాక్టీస్ చేశాను. ఆ కష్టమే నాకు 'మహానటి' లాంటి బ్లాక్‌బస్టర్‌ను ఇచ్చింది. తెలుగు ప్రేక్షకులు నాపై చూపిస్తున్న ప్రేమే నా బలం, నా సంతోషం. ఈ సినిమా ఇండస్ట్రీ ఒక మ్యాజిక్. ఎవరైనా నిజాయతీగా కష్టపడితే ఇక్కడ కచ్చితంగా గుర్తింపు లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. తన తండ్రి అగ్ర కథానాయకుడు మమ్ముట్టి నుంచి నేర్చుకున్న అత్యుత్తమ సలహా ఏంటన్న ప్రశ్నకు దుల్కర్ ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. "మా నాన్నగారు నా జీవితంలో పెద్దగా జోక్యం చేసుకోరు. నువ్వే ఏదైనా చేయి, తప్పులు చేసి నేర్చుకో అని చెబుతుంటారు. కానీ, ఎప్పుడూ నాకు ఒక సేఫ్టీ నెట్‌లా అండగా ఉంటారు. అలాంటి తండ్రి ఉండటం నా బిగ్గెస్ట్ బ్లెస్సింగ్" అని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 'ఐ యామ్ గేమ్' సినిమా ఒక మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ఇందులో తను మునుపెన్నడూ చేయని విభిన్నమైన, అన్‌లైకబుల్ పాత్రలో కనిపిస్తానని దుల్కర్ తెలిపారు. ఈ కార్యక్రమం చివర్లో విద్యార్థుల కోరిక మేరకు దుల్కర్ చెప్పిన 'అమ్మాడి', 'ఏమే సీతా' డైలాగ్స్ అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి.

'శ్రీనివాస మంగాపురం' చిత్రంతో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది బాలీవుడ్ కథానాయిక రషా థడానీ. ఇప్పుడామె మరో ప్రేమకథతో కుర్రకారుని ఆకట్టుకోవడానికి సిద్ధమవుతుంది. రషా, అభయ్ వర్మ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైకీ లైకా'. సౌరభ్ గుప్తా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రొమాంటిక్ డ్రామాని ఈ ఏడాది థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పుడీ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల చేయాలని నిర్ణయించారట. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా పోస్ట్-ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించనున్నారని బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు రషాతో ఈ చిత్రంలో ఒక ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించనున్నట్లు సమాచారం.

## వచ్చే ఏడాది 'లైకీ లైకా'?



PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S